ప్రజాశక్తి
శుక్రవారం 26 జులై 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

సిట్ నివేదికపై దాగుడుమూతలు

- బయటపెడితే అప్రతిష్టపాలవుతామని టిడిపి, వైసిపిల్లో భయం
- విచారణకే పరిమితం చేసిన ప్రభుత్వాలు
- వెలుగుచూడని రూ.వేల కోట్ల విశాఖ భూ కుంభకోణం



సిట్ కార్యాలయం (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖ నగర, పరిసర ప్రాంతాల్లో వేల కోట్ల రూపాయల విలువైన భూ ఆక్రమణలపై ప్రత్యేక విచారణ బృందం (సిట్) సమర్పించిన నివేదికను తెలుగుదేశం, వైసిపి ప్రభుత్వాలు బయటపెట్టకుండా ఏడేళ్లు దాచిపెట్టాయి. ఒక ప్రభుత్వ కాలంలో జరిగిన అవినీతి, కుంభకోణాలను మరో ప్రభుత్వం వెలికితీసి బురదజల్లడం వరకు ఫలప్రదమవుతున్నాయి తప్పితే సిట్ నివేదికను బహిర్గతం చేసి విలువైన భూమిని స్వాధీనం చేసుకోవడానికి దాగుడు మూతలాడుతున్నాయి. భూ ఆక్రమణల్లో వామపక్షాలు మినహా మిగిలిన టిడిపి, వైసిపి, బిజెపి, జనసేన నాయకుల పాత్ర శక్తి మేరకు వుండడంతో సిట్ నివేదికను బయటపెట్టడానికి ఏ ప్రభుత్వమూ సుముఖత చూపలేదు. వివిధ అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేస్తున్న టిడిపి కూటమి ప్రభుత్వం సిట్ నివేదికలోని అంశాలను ఆక్రమణదారుల పేర్లు, పార్టీలతో విడమర్చి శ్వేతపత్రం విడుదలకు సిద్ధపడ్డంలేదు. సిట్ నివేదికను బయటపెడితే రాష్ట్రంలోని వివిధ స్థాయిల్లోవున్న తమ పార్టీ నాయకులు బయటపడతారని భయపడి, నివేదిక జోలికి వెళ్లడంలేదు.

విశాఖలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు, రికార్డుల ట్యాంపరింగ్‌పై టిడిపి ప్రభుత్వం 2017 జూన్ 20న అప్పటి గ్రేహౌండ్స్ డిఐజి వినీత్ బ్రిజ్‌లాల్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ జి.సృజన, చిత్తూరు జిల్లాకు చెందిన ప్రత్యేక ఉపకలెక్టర్ పార్థసారధితో సిట్ ఏర్పాటుచేసింది. భీమిలి, ఆనందపురం, పద్మనాభం, విశాఖ రూరల్, విశాఖ అర్బన్, గాజువాక, పెదగంట్యాడ, పరవాడ, అచ్యుతాపురం, పెందుర్తి, సబ్బవరం, అనకాపల్లి సహా మరికొన్ని మండలాల్లో వివిధ రకాల ప్రభుత్వ భూములు మూడువేల ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు 2018 జనవరిలో ప్రభుత్వానికి సిట్ నివేదిక సమర్పించింది. ఈ ఆక్రమణలో మూడు వందల మంది పాత్ర వునట్లు నివేదికలో పేర్కొంది. నిజాయతీ కలిగిన అధికారులుగా గుర్తింపు పొందిన ముగ్గురూ కసరత్తుచేసి సమర్పించిన నివేదికను చంద్రబాబు ప్రభుత్వం బయటపెట్టలేదు.

తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం గత ప్రభుత్వ కాలంలో సమర్పించిన సిట్ నివేదికను బహిర్గతం చేయకుండా విశాఖలో భూ ఆక్రమణలపై విచారణకు విశ్రాంత ఐఎఎస్ అధికారి డాక్టర్ విజయకుమార్ నేతత్వంలో విశ్రాంత ఐఎఎస్ అధికారి వైవి.అనురాధ, విశ్రాంత జిల్లా జడ్జి టి.భాస్కరరావుతో సిట్ ఏర్పాటు చేసింది. విచారణ పూర్తిచేసి ప్రభుత్వానికి సిట్ నివేదిక సమర్పించింది. కానీ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కూడా సిట్ విచారణ నివేదికను బహిరంగపర్చలేదు. నివేదిక మిగతా 2లో..

వార్తలు 8లో..



అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం తదితరులు

ప్రజా వ్యతిరేక

కేంద్ర బడ్జెట్‌పై నిరసనలు

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సిపిఎం ఆధ్వర్యాన ర్యాలీలు, ధర్నాలు

ఉత్తరాంధ్రకు ద్రోహంపై మండిపాటు



మద్దిలపాలెంలో నిరసన ప్రదర్శన చేపడుతున్న డాక్టర్ బి.గంగారావు తదితరులు

మాజీ సిఎం జగన్‌పై ఫిర్యాదు

వార్త 2లో..

పోర్టుల ప్రైవేటీకరణ ఆపాలని దీక్షలు ప్రారంభం

వార్త మెయిన్‌లో..

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: యుటిఎఫ్

వార్త 5లో..

విశాఖ పోర్టుకు ఎంవి హహైన్ నౌక

1,99,900 మెట్రిక్ టన్నుల మాంగనీస్‌తో రాక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : న్యూ కాసిల్ మ్యాక్స్ లైన్ స్థాయికి చెందిన ఎంవి హహైన్ నౌక గురువారం విశాఖపట్నం పోర్టుకు చేరుకుంది. ఈ భారీ నౌకను జనరల్ కార్గో బెర్త్‌లో ఉంచారు. గాబన్ నుంచి 1,99,900 మెట్రిక్ టన్నుల మాంగనీస్‌ను ఇది రవాణా చేస్తోంది. భారతీయ పోర్టుకు ఒక నౌక ద్వారా తీసుకొచ్చిన అతి పెద్ద సరుకు ఇదే కావడం గమనార్హం. మొత్తం సరుకులో 1,24,500 మెట్రిక్ టన్నులను విశాఖపట్నం పోర్టులో అన్‌లోడింగ్ చేశారు. ఈ నౌక 300 మీటర్ల పొడవు, 50 మీటర్ల వెడల్పు, 18.46 మీటర్ల డ్రాఫ్ట్ కలిగి ఉంది. ఈ సరుకును ప్రపంచంలోనే మాంగనీస్ ఎగుమతిలో పేరొందిన ప్రముఖ మాంగనీస్ ఎగుమతి దారుడు ఎరామెట్ ఎస్ఎ.ఫ్రాన్స్ రవాణా చేశారు. బోత్రా షిప్పింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ నౌక, మిగతా 2లో..

రైతు బజార్లలో టమాటా రూ.38

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రస్తుతం టమాటా ధర విపరీతంగా పెరుగుతున్నందున స్థానిక మార్కెటింగ్ శాఖ చిత్తూరు జిల్లా నుంచి టమాటాను లాభం, నష్టం లేని విధంగా కొనుగోలు చేసి వినియోగదారులకు బహిరంగ మార్కెట్‌లోని ధర కన్నా తక్కువకు అందించేందుకు ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా శుక్రవారం నుంచి విశాఖపట్నం జిల్లాలోగల అన్ని రైతు బజార్లలో కిలో టమాటా రూ.38కే విక్రయించనున్నట్టు జాయింట్ కలెక్టర్, రైతు బజార్ల చైర్మన్ మయూర్ అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ధరలు తగ్గేంత వరకూ ఈ విధంగా కొనుగోలు చేసి వినియోగదారులకు విక్రయించనున్నట్టు వెల్లడించారు.

ఎర్రమట్టి దిబ్బలను పరిరక్షించుకోవాలి

పర్యావరణ ఉద్యమకారుడు, వాటర్‌మ్యాన్ రాజేంద్రసింగ్

ప్రజాశక్తి - ఆరిలోవ, భీమునిపట్నం : ప్రకృతి సిద్ధంగా ఏర్పడి భౌగోళిక వారసత్వ సంపదగా పేరుగాంచిన ఎర్రమట్టి దిబ్బలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పర్యావరణ ఉద్యమకారుడు, వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ అన్నారు. గురువారం ఆయన విశాఖలోని ముడసర్లోవ జలాశయం, డంపింగు యార్డు, హార్సు క్లబ్ ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం భీమునిపట్నం మండలంలోని ఎర్రమట్టి దిబ్బల ప్రాంతంలో పర్యటించారు. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన ఎర్రమట్టి దిబ్బల విధ్వంసాన్ని ఆయనకు విశాఖకు చెందిన పర్యావరణవేత్త బొలిశెట్టి సత్యనారాయణ వివరించారు. ఈ సందర్భంగా రాజేంద్రసింగ్ మీడియాతో మాట్లాడుతూ ఎర్రమట్టి దిబ్బలు పర్యావరణ సహజ సంపదని, ఇలాంటి భౌగోళిక వారసత్వ సంపద దేశంలో ఒక్క తమిళనాడులో తప్ప మరెక్కడా లేదని గుర్తుచేశారు. ఎర్రమట్టి దిబ్బలను ఎకో టూరిజంగా అభివృద్ధి చేస్తే ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులు విశాఖకు వస్తారని తెలిపారు. ముడసర్లోవ జలాశయాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ జలాశయ కాలుష్యానికి కారణం సమీపంలోని డంపింగ్ యార్డు అని తెలిపారు. తక్షణమే డంపింగ్ యార్డును తొలగించకుంటే తాను సత్యాగ్రహం చేస్తానని హెచ్చరించారు. జలాశయం పక్కనున్న హార్స్ క్లబ్‌ను కూడా ఆయన వ్యతిరేకించారు. కార్యక్రమంలో జివిఎంసి కార్పొరేటర్ మూర్తి యాదవ్, భౌగోళిక శాస్త్రవేత్త రాజశేఖర్‌రెడ్డి, పర్యావరణవేత్త జెవి.రత్నం పాల్గొన్నారు.



ఎర్రమట్టి దిబ్బలను పరిశీలిస్తున్న రాజేంద్రసింగ్

మొదటి పేజీ తరువాయి..

సిట్ నివేదికపై దాగుడుమూతలు

బయటపెడితే తమ పరువు తామే తీసుకున్నట్లవుతుందని భావించి సిట్ నివేదికను బయటపెట్టకుండా పరోక్షంగా ఆక్రమణదారులకు ప్రభుత్వాలు సహాయపడుతూ వస్తున్నాయి.


ప్రభుత్వ భూమి ఆక్రమణలు, రికార్డుల ట్యాంపరింగ్, మాజీ సైనికులకు కేటాయించిన భూములపై నిబంధనలకు విరుద్ధంగా ఎన్ఒసిలు జారీ చేసిన అధికారులపైనా, వారికి సహకరించిన 49 మందిపైనా క్రిమినల్ కేసులు నమోదుచేయాలన్న సూచనా బుట్టదాఖలైంది. 2023 జులైలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గం సిట్ నివేదికకు ఆమోదం తెలిపింది తప్ప నివేదికను బహిర్గతం చేయలేదు. కూటమి ప్రభుత్వం యథాతథంగా సిట్ నివేదికను బహిర్గతం చేసి, విలువైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని నిజాయితీని నిరూపించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విశాఖ పోర్టుకు ఎంవి హహైన్ నౌక

సరుకు నిర్వహణ ఏజెంటుగా సేవలు అందిస్తోంది. విశాఖపట్నం పోర్టు, బోత్రా షిప్పింగ్ సర్వీసెస్‌కి ఈ తాజా పరిణామం ఒక ముఖ్యమైన మైలురాయి అని విశాఖ పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు తెలిపారు. తమ పోర్టు ఇటువంటి మైలురాళ్లను చేరుకోవడానికి మరింత కృషి చేయనుందన్నారు.

సిటీ ఆపరేషన్ సెంటర్‌ను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సిటీ ఆపరేషన్ సెంటర్‌ను నూతన కమిషనర్ పి.సంపత్ కుమార్ గురువారం సందర్శించారు. సెంటర్ ద్వారా ఏయే సేవలు నిర్వహిస్తున్నారని పర్యవేక్షక ఇంజినీర్ వినయ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జివిఎంసి కార్యనిర్వాహక ఇంజినీరు సుబ్బారావు, స్మార్ట్ సిటీ మేనేజర్ ఆనంద్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న క్రెడాయ్ ప్రతినిధులు

విశాఖ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాం : క్రెడాయ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) విశాఖ చాప్టర్ ఆఫీస్ బేరర్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్‌తో సమావేశమయ్యారు. నగర అభివృద్ధికి అసోసియేషన్ సహకారంపై చర్చించారు. విశాఖ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో సిఎస్ఆర్ ప్రాధాన్యాన్ని వివరించారు. ఆసుపత్రులు, పాఠశాలలు, హాస్టళ్లతో సహా అవసరమైన ప్రజా సౌకర్యాల అభివృద్ధికి క్రెడాయ్ వనరులను అందించాలని కోరారు. జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ విశాఖను ఎకో ఫ్రెండ్లీ, గ్రీన్ సిటీగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్రెడాయ్ తమ ప్రాజెక్టులలో పర్యావరణ అనుకూల చర్యలను సమన్వయం చేయాలని కోరారు. క్లీన్ ఎనర్జీ, వేస్ట్ మేనేజ్‌మెంట్, గ్రీన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌కు తోడ్పడే కార్యక్రమాలను ప్రోత్సహించాలన్నారు.

రి.క.నెం.722/2024/ఎ/ తహశీల్దార్ వారి కార్యాలయము
తే: 26-07-2024 గోపాలపట్నం

పత్రికా ప్రకటన

గోపాలపట్నం మండలం, కప్పరాడ గ్రామ కాపురస్తులు, శ్రీ మూల మహేశ్వరరావు, తండ్రి లేటు మూల లక్ష్మునాయుడు, ఇంటి నెం.39-23-40/1, నరసింహనగర్, మద్రిపాలెం గ్రామం, గోపాలపట్నం, విశాఖపట్నం వారు ఈక్రింది పట్టికలో తెలిపిన స్థలమునకు నిరభ్యంతర ధృవీకరణ పత్రము (NOC) మంజూరు చేయవలసినదిగా కోరియున్నారు.

గ్రామము పేరు	సర్వే నెం	విస్తీర్ణము
మద్రిపాలెం గ్రామం	సర్వేనెం. 80/3డి భాగం	102 చ.గ.

పైన తెలిపిన భూమికి నిరభ్యంతర ధృవీకరణ పత్రము మంజూరు చేయుటకు ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో, ఈ ప్రకటన వెలువడిన15 దినములలోగా శ్రీ జాయింటు కలక్టరు మరియు కాంపిటేంట్ ఆథారిటీ, అర్బన్ ల్యాండ్ సీలింగ్, కలక్టర్ కార్యాలయము, విశాఖపట్నం వారికి మరియు శ్రీ తహశీల్దారు, గోపాలపట్నం వారికి లిఖిత పూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.

తహశీల్దార్
గోపాలపట్నం మండలం

జివిఎంసి కమిషనర్‌కు అభినందనలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.సంపత్ కుమార్‌ను జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సహాయ సహకారాలు అందించాలన్నారు. చేస్తున్న పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడకూడదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఛైర్మన్ రొంగళి జగన్నాధం, గౌరవ అధ్యక్షులు వి.సత్యనారాయణ, అధ్యక్షులు గొంప చంద్రమౌళి, కార్యదర్శి రంధి సాధురావు, ఉపాధ్యక్షులు పిఎస్.ప్రసాద్, పి.ఎ.రాజు, బి.రామానాయుడు, సలహాదారులు పైలా కృష్ణారావు, నాగరాజు, ఆడిటర్ ఎస్.రవీంద్ర, జాయింట్ సెక్రటరీ పిల్లా సూరిబాబు, ఎంవి.సత్యనారాయణ, గణేష్, రాంబాబు, సూర్యనారాయణ, పెద్దఎత్తున కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



కమిషనర్ సంపత్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

మాజీ సిఎం జగన్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: రాష్ట్రంలో అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డిపై తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అనంత లక్ష్మి గురువారం ఉదయం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం అక్కడ మీడియాతో మాట్లాడుతూ తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్న సాక్షి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎవరూ జగన్ మాయమాటలు నమ్మొద్దని హితవు పలికారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గాన్ని అన్నింటా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ అన్నారు. శ్రీ జగన్నాథస్వామి రథోత్సవాలు ముగియడంతో గురువారం దేవస్థానంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ టి.రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు

బస్సు, ఆటో సీజ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నిబంధనలను ఉల్లంఘించిన స్కూలు బస్సులు, స్కూలు ఆటోలపై గురువారం రవాణా శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. ఒక స్కూలు బస్సును, ఆటోను సీజ్ చేశారు. ఈ విషయాన్ని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ రాజారత్నం మీడియాకు తెలిపారు. గత నెల 13 నుంచి నేటి వరకు 51 కేసులు నమోదు చేసి 5 బస్సులను, 25 ఆటోలపై కేసులు నమోదు చేసి 5 ఆటోలను సీజ్ చేసినట్టు వెల్లడించారు. ఈ తనిఖీలలో మోటారు వాహన తనిఖీ అధికారులు బి.రాజారావు, ఐ.మాధవి పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ వారం.. ఎంతో అవసరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రపంచ ఓఆర్ఎస్ (ఓరల్ డీ హైడ్రేషన్ సాల్ట్) వారాన్ని ప్రతి ఏటా నిర్వహించడం ద్వారా డీహైడ్రేషన్ కారణంగా సంభవించే డయేరియాను నియంత్రించవచ్చని కెజిహెచ్ పీడియాట్రిక్స్ హెచ్ఒడి డాక్టర్ బిఎస్.చక్రవర్తి గురువారం మీడియా తెలిపారు. ఓఆర్ఎస్ వారం ఎంతో కీలకమని అన్నారు. డయేరియా కారణంగా చిన్నపిల్లలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నార‌న్నారు. గురువారం నుంచి ఆంధ్ర మెడికల్ కళాశాల పీడియాట్రిక్స్ విభాగం ఆధ్వర్యాన ఈ నెల 31వ తేదీ వరకు ప్రపంచ ఓఆర్ఎస్ వారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

చిల్డ్రన్స్ థియేటర్‌లో సినిమాలు వేయాలని వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నంలోని సిరిపురంలోగల వియంఆర్‌డిఎ చిల్డ్రన్స్ థియేటర్‌లో బాలల సినిమాలు వేయాలని వైజాగ్ ఫిల్మ్ సొసైటి కార్యదర్శి నరవ ప్రకాశరావు కోరారు. ఈ మేరకు ఆయన గురువారం వియంఆర్‌డిఏ కార్యాలయంలో కమిషనర్ కెఎస్.విశ్వనాథన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొన్నేళ్లుగా చిల్డ్రన్స్ థియేటర్‌లో బాలల కార్యక్రమాలు నిలిపివేసి కేవలం ప్రైవేట్, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు పరిమితం చేయడంపై విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫిల్మ్ సొసైటి సహాయ కార్యదర్శి డాక్టర్ బాబ్జి పాల్గొన్నారు.

వర్షాకాలంలో జుట్టు సంరక్షణ కీలకం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వర్షాకాలంలో జుట్టు సంరక్షణకు పారాచూట్ అడ్వాన్స్ అలోవెరా ఎన్రిచ్డ్ కోకోనట్ హెయిర్ ఆయిల్ ఎంతో ఉపయోగపడుతుందని ఆ సంస్థ ప్రతినిధి ప్రసాద్ తెలిపారు. బీచ్ రోడ్‌లో జుట్టు సంరక్షణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అలోవెరా, కొబ్బరి ఆధారిత ఈ హెయిర్ ఆయిల్ ఎంతో ప్రత్యేకమైనదన్నారు. ఆ ఆయిల్ ఉపయోగాలను వివరించారు.

దావా సమను

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No. 06 / 2019

బిట్వీన్:
ధర్మిరెడ్డి ప్రసాదు ... వాది
మరియు:
లచ్చి వెంకట సుబ్బారావు ... ప్రతివాది
టు:
లచ్చి వెంకట సుబ్బారావు,
తండ్రి అర్జునరావు
అచ్యుతాపురం గ్రామము,
అచ్యుతాపురం మండలము.

దావా పరిహారం నిమిత్తం మీ మీద పైన వివరించిన వ్యాజ్యము వాది తెప్పించినందు వల్ల సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పగా అందువలన **2024వ సం॥ ఆగస్టు నెల 5వ తారీఖున పగలు 10-30 గంటలకు** స్వతహాగా లేక సరిఅయిన భోగట్టా య్యివ్వబడిన వకీలు గారి ద్వారాగా లేక సరిఅయిన ఏజంటు మూలముగా ఈ కోర్టులో హాజరయ్యేటట్లు యుండువలన మీకు ఆజ్ఞాపించడమైనది, మీ ప్రతివాదమునకు ఆధారముగా వుద్దేశించి యుండే దస్తావేజులన్నిటినీ నీ యొక్క స్టేట్‌మెంటుతో సహా ఆరోజున హాజరుపర్చుటకు మీకు ఉత్తరువు చేయడమైనది.

పైన చెప్పబడిన దినమందు మీరు హాజరు కాకుండా తప్పిన యెడల మీ పరోక్షమందు పై వ్యాజ్యమును విమర్శన చేసి తీర్మానించుట మగునని మీరు తెలుసుకోవలసినది.

(బై ఆర్డర్)
వాడపల్లి అన్నపూర్ణయ్య
యలమంచిలి, అడ్వకేటు, యలమంచిలి,
తే:25-07-2024 అనకాపల్లి జిల్లా.

IN THE HONOURABLE COURT OF THE 13TH ADDITIONAL DISTRICT JUDGE AT GAJUWAKA
I.A.No. 1373 OF 2016 in O.S.No.62 OF 2016

Between:
Smt. Vankayala Suseela and 2 others.
(The plaintiffs 1 to 3 are represented by their General Power of Attorney Holder Smt. Vurukuti Mutyalamma W/o. Late V.Somulu)
... Petitioners/Plaintiffs
And:
Guraja Samuel and 3 others
... Respondents/defendants..

NOTICE TO 2nd RESPONDENT/ 2nd DEFENDANT:

Goli Varalakshmi,
W/o. Late G.Vara Prasad, Flat No.8037, 4th Block, M.V.V. City, P.M.Palem, Madhurawada, Visakhapatnam.

Whereas the petitioners/plaintiffs have instituted the above suit against you and 3 other defendants for declaration of their right and title and for possession and mandatory injunction in over the plaint "B" schedule property and also for the permanent injunction in respect of plaint "C" schedule property and for costs of the suit. The suit was dismissed for default on 21-03-2022. Then petitioners/plaintiffs have filed the petition in I.A.No. 1373/2022 to condone the delay in filing the petition to set aside the dismissal order dated 21-03-2022 and to restore the suit. The matter is posed to 31-07-2024 for your appearance.

Therefore take notice in the above said petition and you are hereby summoned to appear in the above Court in person or by a pleader duly Instructed and able to answer all material questions relating to the petition on **31-07-2024 at about 10-30 a.m.**, failing which the petition will be heard in your absence and decide the matter in your absence and decide the matter.

B. MURALI KRISHNA RAJU
K. SATYA VANI, B.DEVA KIRAN RAJU
Advocates,Plot No. 109 & 110,
Bhavani Nagar, B.C.Road New
Gajuwaka, Visakhapatnam-530 026
Cell: 9393260078

IN THE HONOURABLE COURT OF THE 13th ADDITIONAL DISTRICT JUDGE AT GAJUWAKA
I.A.No.1374 OF 2016 IN I.A.No. 483 OF 2016 IN O.S.NO.62 OF 2016

Between:
Smt. Vankayala suseela and 2 others.
(The plaintiffs 1 to 3 are represented by their General Power of Attorney Holder Smt. Vurukuti Mutyalamma W/o. Late V.Somulu)
... Petitioners/Plaintiffs
And:
Guraja Samuel and 3 others
... Respondents/defendants

NOTICE TO 2nd RESPONDENT/ 2nd DEFENDANT:

Goli Varalakshmi,
W/o. Late G.Vara Prasad, Flat No.8037, 4th Block, M.V.V. City, P.M.Palem, Madhurawada, Visakhapatnam.

Whereas the petitioners/plaintiffs have instituted the above suit against you and 3 other defendants for declaration of their right and title and for possession and mandatory injunction in over the plaint "B" schedule property and also for the permanent injunction in respect of plaint "C" schedule property and for costs of the suit. The petitioners/plaintiffs also filed I.A.No. 483 OF 2016 IN O.S.NO.62 OF 2016 for granting of temporary injunction. On 21-03-2022 the suit and the petition were dismissed for default. Then Petitioners/Plaintiffs have filed the petition in I.A.No. 1374/2022 to condone the delay in filing the petition to set aside the dismissed for default order Dated 21-03-2022 and to restore the petition. The matter is posted to 31-07-2024 for your appearance.

Therefore take notice in the above said petition and you are hereby summoned to appear in the above Court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the petition on **31-07-2024 at about 10-30 a.m.**, failing which the petition will be heard in your absence and decide the matter in your absence and decide the matter.

B. MURALI KRISHNA RAJU
K. SATYA VANI, B.DEVA KIRAN RAJU
Advocates,Plot No. 109 & 110,
Bhavani Nagar, B.C.Road New
Gajuwaka, Visakhapatnam-530 026
Cell: 9393260078

రి.క.నెం.723/2024/ఎ/ తహశీల్దార్ వారి కార్యాలయము
తే: 26-07-2024 గోపాలపట్నం

పత్రికా ప్రకటన

గోపాలపట్నం మండలం, కప్పరాడ గ్రామ కాపురస్తులు, శ్రీమతి బెహర ప్రమీల భర్త దీనబంధు, కళింగనగర్, ఈస్ట్‌పార్క్ దరి, మాధవధార, గోపాలపట్నం, విశాఖపట్నం వారు ఈక్రింది పట్టికలో తెలిపిన స్థలమునకు నిరభ్యంతర ధృవీకరణ పత్రము (NOC) మంజూరు చేయవలసినదిగా కోరియున్నారు.

గ్రామము పేరు	సర్వే నెం	విస్తీర్ణము
మాధవధార గ్రామం	సర్వేనెం. 25/3బి1 భాగం	99.85 చ.గ.

పైన తెలిపిన భూమికి నిరభ్యంతర ధృవీకరణ పత్రము మంజూరు చేయుటకు ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో, ఈ ప్రకటన వెలువడిన15 దినములలోగా శ్రీ జాయింటు కలక్టరు మరియు కాంపిటేంట్ ఆథారిటీ, అర్బన్ ల్యాండ్ సీలింగ్, కలక్టర్ కార్యాలయము, విశాఖపట్నం వారికి మరియు శ్రీ తహశీల్దారు, గోపాలపట్నం వారికి లిఖిత పూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.

తహశీల్దార్
గోపాలపట్నం మండలం

భీమిలి డివిజన్‌లో 70 శాతం వరినార్లు..

▸▸ కురిసిన వర్షాలతో ముమ్మరంగా నారుపోత

▸▸ కొన్నిచోట్ల దమ్ములు



వరి నారు మడి

ప్రజాశక్తి -భీమునిపట్నం : పూర్తిగా వర్షాధారం గల భీమిలి వ్యవసాయ డివిజన్ పరిధిలో గల భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ప్రస్తుత వర్షాలకు వరి నార్లు వేయడం జోరందుకుంది. దాదాపు 70శాతం మేర నార్లు వేయడం జరిగింది. ఇందులో కొంత మేరకు నీటి సదుపాయం ఉన్న బోర్లు కింద నార్లు వేశారు. వాస్తవంగా జులై మొదటి వారంలో నార్లు వేయాల్సి ఉన్నప్పటికీ, వర్షాలు కురవక పోవడంతో రెండు వారాలు ఆలస్యంగా నార్లు వేశారు. దాదాపు 50 ఎకరాల్లో దమ్ములు జరిగాయి. భీమిలి మండలం తాటితూరు, పద్మనాభం మండలం గందవరం, కృష్ణాపురం, మద్ది, ఆనందపురం మండలం బోని తదితర గ్రామాల్లో కొంత మేరకు ఇప్పటికే దమ్ములు జరిగాయి.

డివిజన్‌లో 6,700 ఎకరాల్లో వరి నారు..

భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ఇప్పటికే బోర్లు కింద, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సుమారు 6,700 ఎకరాల్లో వరి నార్లు వేశారు. మండలాల వారీగా వరి పంట సాధారణ విస్తీర్ణం పరిశీలిస్తే... భీమిలి మండలంలో 1218 ఎకరాలు, ఆనందపురం మండలంలో 1472 ఎకరాలు, పద్మనాభం మండలంలో 6,627 ఎకరాలుగా ఉంది. ఇప్పటి వరకూ సుమారు 70 శాతం వరి నార్లు వేశారు.

డివిజన్‌లో మొక్క జొన్న సాధారణ విస్తీర్ణం 96 ఎకరాలు కాగా, కేవలం ఏడున్నర ఎకరాల్లో విత్తనాలు వేశారు. భీమిలి మండల పరిధిలోని పలు గ్రామాల్లో మాత్రమే ఏడున్నర ఎకరాల్లో మొక్క జొన్న పంట వేశారు. భీమిలి మండలంలో మొక్క జొన్న పంట సాధారణ విస్తీర్ణం 62 ఎకరాలు, కాగా కేవలం ఏడున్నర ఎకరాల్లో విత్తనాలు వేశారు. ఆనందపురం మండలంలో మొక్క జొన్న పంట సాధారణ విస్తీర్ణం 5 ఎకరాలు, పద్మనాభం మండలంలో 30 ఎకరాలు.

వర్షపాతం ఇలా...

జూన్ నుంచి జులై 23 వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. ఆనందపురం మండలంలో 353.1 మిల్లీ మీటర్లకు గాను ఇప్పటి వరకు 290.2 మిల్లీ మీటర్లు, పద్మనాభం మండలంలో 454.1 మిల్లీమీటర్లకు గాను 259.2 మిల్లీ మీటర్లు, భీమిలి మండలంలో 325.7 మిల్లీ మీటర్లకు గాను 197.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

నారు మడుల్లో సూక్ష్మ పోషకాల లోపం...

పలు నారు మడుల్లో సూక్ష్మ పోషకాల లోపం ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారుల క్షేత్ర స్థాయి పరిశీలనలో తేలింది. ఆకులు పత్ర హరితం లోపించి తెల్లగా పాలిపోవడాన్ని సూక్ష్మ పోషకాల లోపంగా, దీన్నే ఐరన్ లోపంగా అధికారులు గుర్తించారు. 12 శాతం ఇడిటిఎ ఫెర్రస్ లేదా 2 గ్రాముల ఫార్ములా -4 ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఆకులపై జింక్ లోపం ఉన్నట్లు గుర్తించారు. దీని నివారణకు 2 గ్రాముల జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



బి.విజయప్రసాద్
అసిస్టెంట్ డైరెక్టర్
వ్యవసాయ శాఖ
భీమిలి డివిజన్

హుదూద్ ఇళ్ల కోసం కొనసాగుతున్న రైతుల నిరసన

ప్రజాశక్తి-పిఎం.పాలెం : ఇళ్లు కేటాయించాలంటూ భూములు కోల్పోయిన రైతుల చేస్తున్న నిరసన గురువారమూ కొనసాగింది. ఈ శిబిరంలో స్థానిక టిడిపి నాయకులు గరే గురునాథ్, రెడ్డి సత్యనారాయణ పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గరే గురునాథ్ మాట్లాడుతూ, 2014లో అప్పటి టిడిపి హయాంలో సినీ మా ఇండస్ట్రీస్ ఆధ్వర్యాన బక్కన్నపాలెం, రేవళ్లపాలెం, కొమ్మాదిలో రైతుల భూములు తీసుకొని హుదూద్ ఇళ్ల నిర్మాణాలను చేపట్టిందన్నారు. భూములు కోల్పోయిన రైతులకు వైసిపి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించలేదన్నారు. స్థానిక రైతులకు న్యాయం చేయకుండా గత ఉత్తర నియోజకవర్గంలో ఉన్న వారికి ఇల్లు మంజూరు చేయడం దుర్మార్గం అన్నారు. రైతుల సమస్యను స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లామని, తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఎంఆర్‌పి నాయకులు ఎం.రమణ మాట్లాడుతూ రైతులకు ఇస్తామన్న ఇళ్లు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఇళ్లు కేటాయించి న్యాయం చేసేవరకు పోరాటం ఆగదని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కొప్పాక రామకృష్ణ, కొరగంజి సూరిబాబు, కొల్లి బాబ్జీ, వెంకటరమణ, బి.పోతురాజు, కెవిపిఎస్ నాయకులు ఎస్.పైడిరాజు, కె.నాగరాజు, ఎస్.పైడితల్లి, ఎస్.దేవుడు, ఎస్.రాజు, అచ్చన్న, యు.అరుణ, సిపిఎం నాయకులు డి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితునికి 20 ఏళ్లు జైలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం పేకేరు గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన నిందితునికి 20 ఏళ్లు జైలు శిక్ష, రూ. 10 వేలు జరిమానా విధిస్తూ గురువారం విశాఖ స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి ఆనంది తీర్పు ఇచ్చినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. 2020వ సంవత్సరంలో ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధి పేకేరు గ్రామానికి చెందిన ఉప్పాడ శంకర్రావు ఊరి బయట ఉన్న పశువుల పాకలో 12 ఏళ్ల బాలికను తీసుకొని వెళ్లి అత్యాచారం చేశాడు. దీనిపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ వాదన అనంతరం నిందితుడికి పై విధంగా శిక్ష ఖరారు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ : మారికవలస సబ్‌స్టేషన్ పరిధి 11 కెవి జెఎన్ఎన్‌యుఆర్ఎం ఫీడర్‌పై మరమ్మత్తుల నిమిత్తం పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు జోన్- 3 డిఇ పి.శ్రీనివాసరావు తెలిపారు. మారికవలస జంక్షన్, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ, శారదానగర్ కాలనీ, పిపి-2 కాలనీలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మధురవాడ సబ్ స్టేషన్ పరిధి 11 కెవి శివశక్తినగర్ ఫీడర్‌పై మరమ్మత్తుల దృష్ట్యా శివశక్తి నగర్, సద్గురు సాయినాథ్ కాలనీ, గణేష్ నగర్, శ్రీలక్ష్మినగర్, అయ్యప్పనగర్, వికలాంగుల కాలనీ, కార్పెంటర్ కాలనీ, టైలర్స్ కాలనీ, వైఎస్ఆర్ కాలనీ తదితర ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని శ్రీనివాసరావు తెలిపారు.

భీమునిపట్నం : నిర్వహణ పనుల నిమిత్తం జివిఎంసి నాలుగో వార్డు పాత పరదేశిపాలెం, కాపులుప్పాడ, పెద ఉప్పాడ, చేపలుప్పాడ, కొత్తూరు, పాతూరు, గోవుపేట, నేరెళ్లవలస ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్, ఆపరేషన్, జోన్-3 ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అధ్వానంగా ఆరోగ్య ఉపకేంద్రం

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని తర్లువాడ ఆరోగ్య ఉప కేంద్రం అపరిశుభ్ర వాతావరణంతో చాలా అధ్వానంగా ఉందని స్థానిక స్వచ్ఛంద సేవకుడు కోరాడ ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. భవనం చుట్టు మురుగునీరు నిల్వచేరి దుర్వాసన వస్తోందని తెలిపారు. దీని వల్ల కేంద్రానికి వచ్చే రోగులు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. భవనానికి మరమ్మత్తులు కూడా చేపట్టాల్సి ఉందన్నారు. తక్షణమే స్థానిక పంచాయతీ సిబ్బంది, అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

ఇళ్ల స్థలాల్లో రాజకీయ జోక్యం వద్దని ఆందోళన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస ఇళ్ల స్థలాలలో రాజకీయ జోక్యం విడనాడి అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు గురువారం వేములవలస జగనన్న కాలనీలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, వేములవలస జగనన్న కాలనీలో 377 మంది లబ్ధిదారుల్లో సుమారు 100 మందికి మొదటవిడతగా ఇచ్చారని, ఇందులో మృతులకు ఇళ్లు మంజూరు చేసినట్లు కొంతమంది తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వాస్తవాలను పరిశీలించి చర్యలు చేపట్టాలని కోరారు. ఇళ్ల ఎంపిక 2020లో జరిగిందని, పలు రాజకీయాల వలన పట్టాల మంజూరులో జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుతం సర్వే నెంబరు 151/1 లో 100 వందమందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారని, సర్వేనెంబర్ 155లో మిగిలిన వారికి పట్టాలు అందజేసి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరాడ అప్పలస్వామినాయుడు ఎంపిటిసి సభ్యులు కోరాడ సూరికుమారి, రాంబాబు లబ్ధిదారులు బసవయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ప్రజలతో ఉండాలి : ముత్తంశెట్టి

ప్రజాశక్తి -భీమునిపట్నం : నిత్యం ప్రజలతో మమేకమై ఉండాలని, తద్వారానే వారి అభిమానం చూరగొనవచ్చని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రైతులు, ప్రజల ఇబ్బందులను తెలుసుకోవాలని కోరారు. ప్రజా సమస్యలను పంచాయితీల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆక్రమణదారుల విభేదాలతో రచ్చకెక్కిన స్థల వివాదం



కొండను చదును చేయిస్తున్న ఆక్రమణదారులు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం జట్లమ్మ కొండ సమీపంలో అక్రమ ఇళ్ల స్థలాల విషయం గురువారం ఆనందపురం పోలీస్ స్టేషన్‌కు చేరింది. గురువారం సాయంత్రం రాజకీయ పలుకుబడితో పొడుగుపాలెం గ్రామానికి చెందిన బంటుపల్లి శంకర్రావు అక్రమ నిర్మాణానికి పాల్పడ్డాడు. ఆనందపురం గ్రామానికి చెందిన నడిపూరి సురేష్ తానూ ఇల్లు నిర్మాణం చేపడతాని చెరో జెసిబిలతో పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న స్థానికులు వీరిద్దరికీ గతంలో ఈ కొండ ప్రాంతంలో ఇళ్లను అక్రమంగా నిర్మించారని, మరలా రెండో దఫా అక్రమ నిర్మాణాలు చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు.

మీకు దిక్కున చోట చెప్పుకొండని బెదిరించడంతో స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇన్చార్జ్ విఆర్ఓ సుమిత్ర, ఆనందపురం విఆర్ఎ అప్పలరాజు సంఘటన స్థలానికి చేరుకొని రెండు జెసిబిలను అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. సురేష్ జెసిబిని తీసుకొని పరార్ కావడానికి ప్రయత్నించాడు. మరో జెసిబి ఓనర్ అయిన పాలవలస కృష్ణ రెండు జెసిబిలను అదుపులోకి తీసుకుంటేనే తాము స్టేషన్‌కు వస్తామని ఎదురు తిరిగాడు. దీంతో రెవెన్యూ అధికారులు రెండు జెసిబిలపై ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

అపోలోలో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ హెల్త్‌సిటీలోని అపోలో ఆసుపత్రిలో ప్రొఫెసర్ డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ అరుదైన, సున్నితమైన ఆర్థోస్కోపీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. 30 ఏళ్ల వ్యక్తి తీవ్ర భుజం నొప్పితో గత ఆరు నెలలుగా బాధపడుతున్నాడు. సంప్రదాయ చికిత్స చేసినా నయం కాలేదు. దీంతో బాధితుడు ఆపోలో ఆసుపత్రిలో ప్రముఖ ఆర్థో సర్జన్ డాక్టర్ డి.ఖాన్‌ను సంప్రదించారు. ఎంఆర్ఐ స్కాన్‌లో రొటేటర్ కఫ్ చీలికను నిర్ధారించారు. డాక్టర్ ఖాన్ రొటొటర్ కఫ్ నయం చేసి, బయోఇండక్టివ్ రీజెనెటెన్ ఇంప్లాంట్ విజయవంతంగా నిర్వహించారు. దీనితో రోగి బాగా కోలుకున్నాడు. 24 గంటల్లో డిశ్చార్జ్ అయ్యాడు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ బయో ఇండక్టివ్ రీజెనెటెవ్ ఇంప్లాంట్‌ని ఉపయోగించడం ఇదే తొలిసారి అని డాక్టర్ డి ఖాన్ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం : సీజనల్ వ్యాధులపై విద్యార్థులు పూర్తి అవగాహన కల్గివుండాలని ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సామాజిక ఆరోగ్య అధికారి పి సాంబమూర్తి సూచించారు. నేలతేరు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో గురువారం చేపట్టిన దోమల మందు పిచికారీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన ఆరోగ్య అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో మలేరియా, డెంగీ ప్రబలే అవకాశముండటంతో మండలంలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల మందు పిచికారి చేస్తున్నట్టు తెలిపారు. మలేరియా జిల్లా కేంద్రం ఆరోగ్య పర్యవేక్షకులు రామునాయుడు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.

సహజ సంపదలను కాపాడుకోవాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖలో ఉన్న ప్రకృతి అందాలను, సహజ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేందర్ సింగ్ అన్నారు. కరువు, వరదల నివారణ ప్రపంచ ప్రజా కమిషన్ ఆధ్వర్యాన వారసత్వ సంపద సంరక్షణపై చర్చ నిర్వహించారు. అనంతరం పౌర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖలో ఉన్న సహజ సంపద మూడు దశాబ్దాలుగా కాలుష్యంతో సతమతమవుతుందన్నారు. గుర్రపు పార్కులను నిర్మించకూడదన్నారు. టూరిజం, తీర్థయాత్రలకు తేడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు ప్రకృతి సంపదను ధ్వంసం చేస్తున్నాయని విమర్శించారు. కొండలు, చెరువులు, నదులు, వృక్షాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

రాణి శర్మ మాట్లాడుతూ తొట్లకొండలో 3000 ఎకరాలు ఉన్న ప్రాంతాన్ని 1200 ఎకరాలకు కుదించారని తెలిపారు. అభివృద్ధి పేరుతో తొట్లకొండను, ఎర్రమట్టి దిబ్బలను ధ్వంసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ, సంకు వెంకటేశ్వరరావు, రాజశేఖర్, పీతల మూర్తియాదవ్, గ్రీన్ క్లైమేట్ ప్రతినిధి జివి.రత్నం తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వాటర్ మ్యాన్ రాజేంద్రసింద్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

31న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక వెంకీ బాయ్స్ ఆధ్వర్యాన ఈ నెల 31న పాత గాజువాకలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు విజయవాడలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. శ్రీ లక్ష్మీ ఫర్నీచర్ అధినేత తిరిమిరెడ్డి వెంకటేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ శిబిరాన్ని ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పల్లా పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ వద్ద జరిగే శిబిరంలో వందలాదిగా యువత పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేయనున్నారని చెప్పారు. కార్యక్రమంలో బుల్లెట్ శ్రీనివాస్, జనపరెడ్డి సురేష్, తంకల సతీష్, సాయి మోహన్ కృష్ణ, కోవిలపల్లి జోగినాయుడు, చంద్రమౌళి పాల్గొన్నారు.

కాలనీల్లోని సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధిలోని పలు కాలనీల సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. వార్డు పరిధి ఉడా కాలనీలో కాంగ్రెస్ నాయకులు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ మాజీ వైస్ ప్రెసిడెంట్ విన్నకోట రాము మాట్లాడుతూ, ఈ చుట్టుపక్కల 15 కాలనీలు ఉన్నాయని, శ్మశాన వాటిక లేకపోవడంతో ప్రజలందరూ చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డ్రెయినేజీలు, రోడ్లు సరిగా లేవన్నారు.

కాంగ్రెస్ నాయకులు గోవిందరావు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలోని ప్రభుత్వ భూములు యథేచ్ఛగా కబ్జాలకు గురవుతున్నాయని, దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్.నారాయణనాయుడు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

రైతుబజార్‌ను సందర్శించిన డిఎస్‌ఒ

ప్రజాశక్తి -కరాస : జివిఎంసి 52వ వార్డు పరిధి ఉడా లే-అవుట్‌లోని మర్రిపాలెం రైతు బజార్‌ను జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి (డిఎస్‌ఒ) సూర్యప్రకాష్ గురువారం సందర్శించారు. రైతుబజార్‌లో ఏర్పాటుచేసిన కంది పప్పు, బియ్యం ప్రత్యేక కౌంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బహిరంగ మార్కెట్‌లో పేద మధ్య తరగతి ప్రజలకు కందిపప్పు, బియ్యం రేట్లు ధరా భారంగా మారడంతో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. కందిపప్పు రూ.160కి, బీపీటీ సోనా మసూరి స్టీమ్డ్ బియ్యం రూ.49కి ఇస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్కిల్-1 ఎఎస్‌ఒ జి.మురళీనాథ్, ఆర్‌ఐ కోమలి, రైతుబజార్ ఎస్టేట్ అధికారి కె.వరహాలు, సహాయకుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బిసిజి వ్యాక్సినేషన్‌ను పరిశీలించిన రాష్ట్ర బృందం

ప్రజాశక్తి-మధురవాడ : మధురవాడ పరిధి రుషికొండ, మిథిలాపురి రిక్షాకాలనీ, బక్కన్నపాలెం, ఎం-2 కాలనీ ఏరియాలోని యుపిహెచ్‌సిల్లో గురువారం నిర్వహించిన బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని రాష్ట్ర బృందం పరిశీలించింది. రాష్ట్ర ఎంఎస్‌హెచ్ లీడ్ కిశోర్‌కుమార్, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ ప్రియదర్శిని వ్యాక్సినేషన్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీబీ ప్రోగ్రాం విశాఖ జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, మధురవాడ టీబీ యూనిట్ సూపర్‌వైజర్లు వి.వీరబ్రహ్మం, సురేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


బిసిజి వ్యాక్సినేషన్‌ను పరిశీలించి సూచనలిస్తున్న రాష్ట్ర ప్రతినిధులు

సమస్యలపై పిడిఎస్‌ఒ నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందజేసి, మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని పిడిఎస్‌ఒ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై జైలురోడ్డు వద్ద గల ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాల వద్ద గురువారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు యమున, జానకి, నాగశ్రీ పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : ఎయులోని సమస్యలను పరిష్కరించాలని పిడిఎస్‌ఒ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. విసి శశిభూషణ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ఆంధ్ర యూనివర్సిటీ కన్వీనర్ ఎల్.భాను మాట్లాడుతూ యూనివర్సిటీలో 18 ఏళ్లుగా భర్తీకి నోచుకోని 926 పోస్టులను భర్తీ చేయాలన్నారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షులు పి.విశ్వనాథ్, నాగేష్, మురళి, పూర్ణ పాల్గొన్నారు.

కళాశాలలో సమస్యలపై పిడిఎస్‌ఒ ర్యాలీ

పెందుర్తి : కళాశాల, పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పిడిఎస్‌ఒ ఆధ్వర్యాన పెందుర్తి కళాశాల నుంచి తహాశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహాశీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌ఒ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.రుద్రి మాట్లాడుతూ, పెందుర్తి జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించాలని, పెందుర్తి ప్రాంతంలో బాలికల సంక్షేమ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌ఒ నాయకులు కార్తీక్, మహేంద్ర, మోహన్, రాజేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిరసన

అనకాపల్లి : పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్ళ సమస్యల పరిష్కారానికి పిడిఎస్‌ఒ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఇన్‌ఛార్జి ఎఒ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. వారంరోజులపాటు ఆందోళన, నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్టు రాష్ట్ర అధ్యక్షులు ఎన్ భాస్కర్ తెలిపారు..అనకాపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల,స్థానిక గాంధీనగర్‌లోని ఎస్సీ కాలేజీ హాస్టల్ కు కొత్త భవనాలు నిర్మాణం, పెండింగ్‌లో ఉన్న రూ.3480 కోట్లు స్కాలర్‌షిప్, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదల, ఖాళీపోస్టుల భర్తీ, ఉచిత పుస్తకాల పంపిణీ, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. పిడిఎస్‌ఓ జిల్లా కో కన్వీనర్ ఎం.జానకిరామ్, ఎం. చందు, ఎన్. గరగ నాయుడు పాల్గొన్నారు.

గీతంలో విజేతల దినోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు 1200 మందికి పైగా ఉద్యోగాలు సాధించడంతో పాటు ప్రముఖ విదేశీ విశ్వవిద్యాలయాలలో సహితం ఉన్నత విద్యాభ్యాసానికి ప్రవేశాలు సాధించడంతో ఎచీవర్స్ డే పేరిట గురువారం విజేతల దినోత్సవాన్ని నిర్వహించారు. దాదాపు 300కి పైగా ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు గీతం ఇంజినీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, ఫార్మశీ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబరిచి ఈ ఘనతను సాధించినట్లు విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు ప్రకటించారు. తెలుగు రాష్ట్రాలలో అత్యధిక సంఖ్యలో విద్యార్థులను ఉద్యోగస్తులుగా ఏటా అందిస్తున్న ఘనత గీతం విశ్వవిద్యాలయందేనని పేర్కొన్నారు. గీతం విద్యార్థులకు కురసెరా ఆన్‌లైన్ కోర్సులను అధనంగా అభ్యసించే వీలు కల్పించామని, తద్వారా ఉద్యోగ అవకాశాలు మరింతగా మెరుగుపడ్డాయని చెప్పారు. వివిధ పరిశ్రమల అవసరాలకు తగిన విధంగా కోర్సులను రూపొందిస్తున్నామని తెలిపారు. గీతం విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాలను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతున్నామన్నారు. గీతం విద్యార్థులలో స్టార్టప్‌ల ఏర్పాటు దిశగా ప్రోత్సహించడానికి వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ (విడిసి) ఏర్పాటు చేశామని వెల్లడించారు.

ప్రముఖ ఐటి సంస్థ టెక్ మహేంద్ర వైస్ ప్రెసిడెంట్ ఎమ్.నాగార్జున మాట్లాడుతూ, నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్న ఉన్నత విద్యాలయంగా గీతం ప్రగతి స్ఫూర్తిదాయకమన్నారు. కుత్రిమ మేధ యువతకు కొత్త సవాళ్లను, అవకాశాలను సృష్టిస్తున్నాయని వాటిని అవకాశాలుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ అధిపతి కెవి.ఉమాదేవి, విశాఖ కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరక్టర్ వంశీకిరణ్ సోమయాజుల, గీతం వివిధ విభాగాల డీన్‌లు, విభాగాధిపతులు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు నియామక పత్రాలను అందిస్తున్న అతిథులు

ప్రజా సమస్యలపై రాజీ లేని పోరు

ప్రజాశక్తి -గాజువాక : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ రాజీ లేని పోరు సాగిస్తోందని సిపిఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ స్పష్టం చేశారు. గాజువాక నియోజకవర్గ సిపిఐ సర్వ సభ్య సమావేశం పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవన్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో, కేంద్రంలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వాలు ప్రజల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ప్రజల సమస్యలను నిర్లక్షం చేస్తే సిపిఐ పోరు సాగిస్తుందని స్పష్టంచేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఎన్‌డిఎ కూటమి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్ ఏర్పాటు కోసం కృషి చేయాలని కోరారు. సిపిఐ కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేస్తూనే, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు జి.ఆనంద్, పల్లేటి పోలయ్య, కెంగువ అచ్యుతరావు, తాండ్ర కనకరాజు, కె.రాజబాబు, పోతన్న, పి.దుర్గారావు, అప్పారి విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టిడిఆర్‌ల స్కామ్ : పల్లా

ప్రజాశక్తి -గాజువాక : విఎంఆర్‌డిఎ 2020-2024 ప్లాన్ మాడిఫికేషన్ చేసి టిడిఆర్ స్కామ్‌కు వినియోగించారని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఈ అంశంపై ఆయన మాట్లాడుతూ, మాడిఫికేషన్‌ను ఆసరాగా తీసుకుని నిషేధిత జోన్స్‌ను మార్చి టిడిఆర్ ఇచ్చారని తెలిపారు. టైటిల్ డీడ్ లేని వాటికి కూడా టిటిఆర్‌లు ఇచ్చినట్లు చెప్పారు. జాలారిపేట వారికి టిడిఆర్ ఇచ్చారని, విశాఖపట్నంలో సిబిసిఎన్‌సి క్రిస్టియన్ స్థలానికి ఎటువంటి రోడ్డు సాధ్యపడదని తెలిసీ కూడా సుమారు 60 కోట్లు టిటిఆర్ ఇచ్చారని తెలిపారు. దీనిపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వివాదాస్పద భూముల పరిశీలన

ప్రజాశక్తి -ఆనందపురం : భీమిలి ఆర్‌డిఒ హుస్సేన్ గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పలు వివాదాస్పద భూములను పరిశీలించారు. ఎన్టీఆర్ పురంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కోసం కేటాయించిన స్థలాన్ని, గంభీరంలో సర్వేనెంబర్ 149కు సంబంధించి వెబ్ లాండ్‌లో ఫ్లాట్ ఓనర్స్ దరఖాస్తు చేసుకున్న స్థలాలను, కుసులవాడ సర్వేనెంబర్ 55/6,7 వివాదాస్పద భూములను పరిశీలించారు. కార్యక్రమంలో తహాశీల్దార్ హేమంత్ కుమార్, సర్వేయర్ రాజేష్, విఆర్‌ఒ దేవరాజ్, విలేజ్ సర్వేయర్ దేవి, నరేష్, రోహిత్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి-అనకాపల్లి : పాఠశాలలు, విద్యారంగంలో నెలకొన్న సమస్యలు సత్వరమే పరిష్కరించాలని యుటిఎఫ్ నేతలు కోరారు. రాష్ట్రకమిటీ పిలుపు మేరకు గురువారం యూనియన్ అనకాపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో డిఇఒ ఎం. వెంకటలక్ష్మమ్మకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కొత్త ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. జిఓ 117 రద్దుచేసి జిఓ ఎంఎస్ నెంబర్ 55 తేదీ 23. 4 2021 ప్రకారం టీచర్లను కేటాయించాలని, ఫ్రీ ప్రైమరీతోపాటు ఒకటి నుండి ఐదు తరగతులు ఒకే పాఠశాలగా నడపాలని, రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని కోరారు. హైస్కూల్స్‌లో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి మినహాయించి, పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు.

హైస్కూల్స్‌లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని, ఒక కిలోమీటరు పైబడి వచ్చే



డిఇఒకు వినతి పత్రం ఇస్తున్న యుటిఎఫ్ ప్రతినిధులు

విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. స్థానిక ప్రాంతాల పరిస్థితులను బట్టి మధ్యాహ్నం భోజనం మెనూ సవరించాలన్నారు. మునిసిపల్ టీచర్ల పిఎఫ్ సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని, గిరిజన ప్రాంతాలలో ప్లస్ టు స్కూల్స్‌ను ఏర్పాటు చేయాలని, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న సిఆర్‌టిలను భాషా వాలంటీర్లను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని డిమాండ్ చేశారు. కోవిడ్ సమయంలో మరణించిన మోడల్ స్కూల్ టీచర్ల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని, మోడల్ స్కూల్ టీచర్ల సర్వీసును వెంటనే విడుదల చేయాలని, పిజిటిలకు జూనియర్ లెక్చరర్ హోదా కల్పించాలని, ఎయిడెడ్ నుండి స్థానిక సంస్థలు, ప్రభుత్వ పాఠశాలలో అబ్జార్బ్ అయిన ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలల ఖాళీలను భర్తీ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని, మినిమం టైం స్కేలు ఉపాధ్యాయుల సర్వీసును రెగ్యులర్ చేయాలని, ప్లస్ టు పాఠశాలల్లో పిజిటి పోస్టులను ప్రమోషన్లు ఇవ్వాలని, పాఠశాలలకు రావలసిన అన్ని రకాల గ్రాంట్లు మంజూరు చేయాలన్నారు. విద్యుత్ బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలని,వేసవి సెలవులలో నాడు నేడు, ప్లస్ టు తరగతులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వి. శ్రీలక్ష్మి, సీనియర్ నాయకులు జి ఎస్ ప్రకాష్, ఎం వి. అప్పారావు, బండారు శంకర్, మాకిరెడ్డి రాజునాయుడు, సలీం, గొంది ఈశ్వరరావు, దేముడు నాయుడు, మామిడి బాబూరావు, ఆశ, తేజ్ వర్ధన్, శివయ్య, రాజు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో చిక్కుకున్నా పట్టించుకోరా?



గెడ్డలో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని వాలాబు గిరిజన పంచాయతీ శివారు బోర్రచింత గిరిజనులు జల దిగ్బంధంలో చిక్కుకున్నారని సిపిఎం మండల కార్యదర్శి బిటి దొర అన్నారు గురువారం అతికష్టం మీద గెడ్డవాగు, దాటి,గ్రామాన్ని సందర్శించారు, గిరిజనులతో కలిసి గెడ్డలో నిరసన తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, బొడ్డగుమ్మి గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో బొర్రచింత గిరిజనులు నిత్యావసరాలు, వైద్యం ,ఇతర అవసరాలకు నానా ఇబ్బందులు పుడుతూ, గ్రామంలోనే చిక్కుకున్నారని, వారికి ప్రభుత్వపరంగా ఎటువంటి సాయం అందకపోవడం దారుణమన్నారు. తక్షణమే బాధితులను ఆదుకోవాలని, ఎన్నాళ్లగానో గిరిజనులు డిమాండ్ చేస్తున్న రహదారి సౌకర్యం కల్పనకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మడుగు మచిరాజు, టుకూరు రాములు, ముర్ల పైడితల్లి, సూకరాజు, దేవరాజు, భీమరాజు, గణేష్ పాల్గొన్నారు.

నారా రోహిత్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న యువ హీరో నారా రోహిత్

ప్రజాశక్తి -అనకాపల్లి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోదరుని కుమారుడు, సినీ హీరో నారా రోహిత్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటి బాలాజీ మర్యాదపూర్వకంగా కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వేట నిషేధ పరిహారం ఇవ్వాలని వినతి



సిపిఎం ఆధ్వర్యాన వినతిపత్రం ఇస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇస్తామన్న రూ.20వేల పరిహారం వెంటనే పంపిణీ చేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఆర్ రాము డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం అచ్యుతాపురం మత్స్యశాఖ అభివృద్ధి కార్యాలయానికి వెళ్లి అధికారి రవితేజకు వినతిపత్రం అందజేశారు రెండు నెలల చేపల వేట విరామంతోపాటు ప్రస్తుతం వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మత్స్యకారులకు వేటకు వెళ్లే వీలులేక కుటుంబపోషణకు ఇబ్బందులు పడుతున్నారని, ఇచ్చిన హామీ మేరకు పరిహారం ఇవ్వాలనికోరారు. సిపిఎంనేతలు జి దేముడు నాయుడు, కె సోము నాయుడు, చేపల తాతయ్య చెల్లూరి నూకన్నా మైలపిల్లి రమణ పాల్గొన్నారు.

మార్టూరులో ఘనంగా క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మార్టూరు గ్రామంలో మండల పరిషత్ యుపి పాఠశాలలో గురువారం శిక్షా సప్తాహ భాగంగా క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ సిఆర్‌కె.దేవరాయలుచ, హెచ్ఎం కె.మురళీకృష్ణ, ఉపాధ్యాయులు ఎం సూర్యలక్ష్మి, విద్యాసాగర్, నాగరాజు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పెండింగ్ ప్యాకేజీ ఇవ్వాలి

ప్రజాశక్తి -రాంబిల్లి : నావెల్ బేస్ నిర్వాసితులకు పెండింగ్ ప్యాకేజీలు వెంటనే ఇవ్వాలని సిపిఎం నాయకులు కోరారు ఈమేరకు గురువారం నేవల్ బేస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ జి దేముడునాయుడు మాట్లాడుతూ నేవల్ బేస్ మెయిన్ గేట్ ముందు ఎనిమిది గ్రామాల నాబ్ నిర్వాసితులు 157 రోజులుగా ఆందోళన చేపట్టగా, ప్రభుత్వం అధికారులు నేవీ నిర్వాసితులతో చర్చలు జరిపి కొత్తపట్నం, వాడ నరసాపురం, వాడపాలెంగ్రామ మత్స్యకార ఫిషింగ్ బోట్లకు ఒక్కో బోటుకు రూ.రెండున్నర లక్షలు నష్టపరిహారం ఇస్తామని, కొత్తపట్నం, వాడ నరసాపురం, గ్రామాలకుప్రతి రేషన్ కార్డుకు, రూ.1,30లక్షలు అందిస్తామని ఒప్పందం జరిగిందన్నారు. అయితే ఇప్పటికీ పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వకపోవడం, రూ. లక్షల విలువ చేసే మత్స్యకారులు ఫిషింగ్ బోట్లు నేవీ లోపలే బంధించడం వలన, నిర్వాసిత



సిపిఎం ఆధ్వర్యంలో ఎస్‌డిసికి వినతిపత్రం ఇస్తున్న మత్స్యకార నేతలు

మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎస్‌డిసి స్పందిస్తూ, ఇప్పటికే కొందరికి ప్యాకేజీ ఇచ్చామని, మిగిలినవారి జాబితా ఫైనలైజ్ చేసి కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. దానిపై తుది నిర్ణయం ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చింతకాయల శివాజీ, చెల్లూరి నూకన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారం

● ఎట్టకేలకు యలమంచిలి బస్‌స్టాండ్‌కు దూరప్రాంత బస్సులు

ప్రజాశక్తి - యలమంచిలి : స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చొరవతో దూరప్రాంత బస్సులన్నీ యలమంచిలి బస్‌స్టాండ్‌కు ఎట్టకేలకు గురువారం నుంచి రావడంపై కూటమి నేతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. జనసేన, తెలుగుదేశం పట్టణశాఖ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు, గొర్లె నానాజీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుందరపు కటౌట్‌కు పాలాభిషేకం చేశారు. రైలుగేటు సాకుతో 13 ఏళ్లుగా దూరప్రాంత బస్సులు జాతీయ రహదారి 16 గుండా ప్రయాణం సాగిస్తూ యలమంచిలి పట్టణంలోకి రావడం లేదు. దాంతో యలమంచిలి ప్రయాణికులు దూరప్రాంతాలకు వెళ్లాలన్నా , అక్కడనుంచి రావాలన్నా నానా అవస్థలు పడేవారు. దీనిపై ఎన్నోసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోని స్థితిలో ఎమ్మెల్యే విజయకుమార్ చొరవతో ఆర్‌టిసి ఉన్నతాధికార్లు ప్రతిస్పందించారు. హైదరాబాద్, అమలాపురం,



ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న కూటమి నేతలు

తిరుపతి, శ్రీశైలం మొదలైన దూరప్రాంత బస్సులన్నీ గురువారం నుంచి యలమంచిలి బస్టాండ్‌కు రావడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో కొఠారు నరేష్,పెయ్యల రామకృష్ణ, కరణం రవికుమార్, కౌన్ కమిటీ సత్యనారాయణ, లంక రాజు, శ్రీను మాస్టర్, ఎస్.చిట్టిబాబు, గుర్రాల శేఖర్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి -అనకాపల్లి : మేజర్ పంచాయతీ తుమ్మపాల గ్రామంలో గురువారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. జెసిబి, ట్రాక్టర్లతో కొత్తపేటవీధిలో ఉన్న సులబ్ కాంప్లెక్స్ దగ్గర చెత్తాచెదారం, వ్యర్థపదార్థాలను తొలగించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్ కు తరలించారు. అలాగే మెయిన్ రోడ్‌లో వర్షపు నీరు నిలువ ఉన్న కారణంగా పక్కన ఉన్న పెద్దకాలువకు జెసిబి ద్వారా కనెక్షన్ ఇచ్చారు. క్రషర్ బుగ్గి వేయించడం, వాటర్ నిల్వ లేకుండా చేశారు. తుమ్మపాల అంబేద్కర్ నగర్, ఎస్సీ కాలనీ, తుమ్మపాల వీధిలో చెత్తాచెదారాన్ని జెసిబి సహాయంతో ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు, ఇఒపిఆర్‌డి ధర్మారావు, పంచాయతీ సెక్రెటరీ ఈశ్వరరావు, వార్డ్ మెంబర్ రవ్వ భవాని, శ్రీను పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యలమంచిలి: యలమంచిలి మున్సిపాలిటీకి మంచినీరు సరఫరా చేసే ప్రధాన వనరైన సోమిదేవపల్లి హెడ్ వాటర్ ట్యాంక్‌కు విద్యుత్ సరఫరా అంతరాయం మూలంగా శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు జరగదని మున్సిపల్ కమిషనర్ ప్రభాకరావు తెలిపారు. మంచినీటి సరఫరాకు అంతరాయం జరిగే ప్రాంతాలకు ట్యాంకుల ద్వారా మంచినీరు అందిస్తామన్నారు. ధర్మవరం, కొత్తపేట,మిలట్రీ కాలనీ, గాంధీనగర్, కోర్టుపేట, భవనం వీధి, ఎర్రవరం ప్రాంతాల్లో మంచినీటికి అంతరాయం కలుగుతుందన్నారు.

ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జ్ రమేష్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి సబ్ జైలును మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జ్, 11 వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ రమేష్ గురువారం పరిశీలించారు. జైల్లో ఖైదీలతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన నిందితులకు ఉచిత న్యాయ సహాయ అవకాశం కల్పిస్తామని, దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జైల్లో సమస్యలు ఉంటే కోర్టు దృష్టికి తీసుకురావాలన్నారు. జైల్లోంచి బయటకు వెళ్ళాక చెడుకు దూరంగా వుండాలన్నారు. జైల్ సూపరింటెండెంట్ గణేష్ రెడ్డి, న్యాయ సహాయకులు సాయిరాం, రోజా, తులసి, ఎమ్ఎల్ఎస్ఎస్ ప్రతినిధి సత్యనారాయణ పాల్గొన్నారు.

పాడి రైతులకు సన్మానం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : హెరిటేజ్ డెయిరీకి అధిక మొత్తంలో పాలు సరఫరా చేస్తున్న ముగ్గురు పాడి రైతులు బొడ్డేడ నరేష్, ఎం జగ్గలక్ష్మి కె పారునాయుడు గురువారం గంగాదేవిపేట గ్రామంలో హెరిటేజ్ డెయిరీ జోనల్ మేనేజర్ వి దివాకర్‌రావు సత్కరించారు. ఈ సందర్భంగా పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అధిక పాల ఉత్పత్తికి రైతులు చేపట్టాల్సిన ముందు జాగ్రత్తలను వివరించారు. డెయిరీ రీజనల్ మేనేజర్ పి తులసినాయుడు మాట్లాడుతూ పాడి పశువులకు పాడి రైతులకు హెరిటేజ్ డెయిరీలో బీమా సదుపాయం కల్పిస్తోందన్నారు. అంతేకాక పాల ధరను ఇతర డెయిరీలతో పోల్చుకుంటే అధికంగా చెల్లిస్తోందని వివరించారు. కార్యక్రమంలో అచ్యుతాపురం మేనేజర్ కె శేషు, వెటర్నరీ అసిస్టెంట్ సిహెచ్ రాము, కె.సీతారాం, బి బలరాం, ఎం దేవేంద్ర పాల్గొన్నారు.

యథేచ్ఛగా భూకబ్జాలు!

హెచ్చరిక బోర్డులను పక్కనబెట్టి అక్రమ నిర్మాణాలు
చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు



కబ్జా చేసిన స్థలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలు

ప్రజాశక్తి- సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 286 లో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం ఎదురుగా భూ కబ్జాలకు ఆడ్డూ అదుపు లేకుండా పోయింది. స్థానిక రెవెన్యూ యంత్రాంగం భూకబ్జాదారులకు కొమ్ము కాస్తున్నట్లు ు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సబ్బవరం సూదికొండ సర్వే నెంబర్ 286లో ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయమై పలువురు స్థానిక రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, తూతూమంత్రంగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ భూకబ్జాదారులు నిర్మాణాన్ని ఆపకుండా పునాదులు నిర్మించి ,సూదికొండలోని గ్రావెల్ ను అర్ధరాత్రి సమయంలో త్రవ్వి పునాదుల్లో గ్రావెల్ నింపుతున్నారు. మండల కేంద్రంలో భూములు విలువ పెరిగిపోవడంతో భూ కబ్జాదారులు బరితెగించి, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు స్పందించకపోవడ పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, అధికారి యంత్రాంగం అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దీనిపై డిటి. వెంకట్ ను వివరణ కోరగా తాము ప్రభుత్వ భూమి హద్దులు గుర్తించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామని, అయితే కబ్జాదారులు నిబంధనలు అతిక్రమించి హెచ్చరిక బోర్డును పక్కన నిలబెట్టి పనులు ఆపకుండా చేస్తున్నారన్నారు. కబ్జాదారులపై పోలీసులకు పిర్యాదు చేయాలని విఆర్ఒను ఆదేశించారు.

విస్సన్నపేట భూఅక్రమాలపై విచారణ

ప్రజాశక్తి- అనకాపల్లి: కశింకోట మండలం, విస్సన్నపేట భూములపై మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ, జీవీఎంసీ కార్పోరేటర్ మూర్తి యాదవ్ ఫిర్యాదుపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించినట్లు మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌కు విస్సన్నపేట భూములపై ఫిర్యాదు చేయగా, తక్షణమే స్పందించి రెవెన్యూశాఖ ఉన్నతాధికారులుతో మాట్లాడారన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అండతో వాగులు, గెడ్డలు దళితుల భూములను వైసిపి నేతలు కబ్జా చేశారని మంత్రికి వివరించినట్టు తెలిపారు.వైసిపి ప్రభుత్వంలో చేసిన అవినీతి అక్రమాలపై విచారణ చేసి బాధితులకు న్యాయం చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి సత్య ప్రసాద్ హామీ ఇచ్చారని పీలా తెలిపారు.

మంత్రి లోకేష్ ను కలిసిన సత్యనారాయణ

అమరావతిలో జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో భాగంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్‌ను అసెంబ్లీలోని వారి ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ కలిసి కొద్ది సేపు చర్చించారు.

కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగ సంఘం నేతలు

ప్రజాశక్తి -సబ్బవరం: జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా యూనిట్ సభ్యులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యర్యక్రమంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎపిజిఇఎ అధ్యక్షులు జి.వి రమణ, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఎస్.కె .బాబు రావు, వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వర రావు ,పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు పి.అప్పారావు (శివ),కార్య వర్గ సభ్యులు సుధాకర్ ,శ్రీనివాస్ ,జీలాని ,నక్కపల్లి యూనిట్ సభ్యురాలు గిరిజాజ్యోతి పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు.

రామ్‌నగర్ రైల్వే గేటు సమీపంలో బ్రిడ్జి నిర్మాణానికి మట్టి నమూనాల సేకరణ

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి రామనగర్ గేటు సమీపంలో బ్రిడ్జి నిర్మాణపనులు చేపట్టడానికి గురువారం తుని రైల్వే కమర్షియల్ విభాగం అధికారులు మట్టి నమూనాలు సేకరిస్తున్నారు.దీనిపై రైల్వే కమర్షియల్ అధికారి నవీన్‌ను వివరణ కోరగా రైలు ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టడానికి అనువైన ప్రదేశమా కాదా అన్న సంగతి కోసం మట్టినమూనాలు సేకరిస్తున్నామన్నారు. మట్టిని లాబ్‌కు పంపి విశ్లేషిస్తామని, రానున్న రోజుల్లో ఇక్కడ ఓవర్ బ్రిడ్జి, లేదా అండర్ పాస్‌వే నిర్మించాలా అన్న విషయంలో స్పష్టత వస్తుందన్నారు. మట్టి నమూనాల సేకరణ గమనించిన స్థానికులు బ్రిడ్జి నిర్మించినంత సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

యలమంచిలి మున్సిపాలిటీ విస్తరణలో భాగంగా సగం జనాభా రైలు గేటు ఆవల నివసిస్తున్నారు. వారితో పాటు సుమారు 7గ్రామాల ప్రజలు ఈ గేటుద్వారానే నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ రైలుగేటు నిర్మించడం పూర్తయితే రామనగర్‌వైపు గల భూములు అమాంతం రెట్టింపు ధరలు పలుకుతాయి. ఎప్పటినుంచో ఇక్కడి ప్రజలు కంటున్న కలలు నిజమయ్యే రోజు దగ్గర పడుతుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పలుచోట్ల విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- మునగపాక: మండలంలోని మునగపాక, పాటిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నాగులపల్లి, ఉమ్మలాడ, గంగాదేవి పేట, ఒంపోలు, వెంకటాపురం, గవర్ల అనకాపల్లి, తోటాడ ,సిరసపల్లి ,రామా రాయుడు పేట, నారాయుడుపాలెం, మూలపేట, చిన్నివానిపాలెం గ్రామాలకు శు క్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జంగిల్ క్లియరెన్స్ రీత్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ రామకృష్ణ తెలిపారు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం సెక్షన్ పరిధిలోని 33/11కెవి నరసింగబిల్లి, కన్నూరుపాలెం సబ్ స్టేషన్స్ పరిధిలోని 11 కెవి ఫీడర్స్ నిర్వహణ కారణంగా శు క్రవారం ఉదయం 8 గంటల నుండి 12 గంటలు వరకు విద్యత్ సరఫరా ఉండదని ఎపిఇపిడిసిఎల్ ఇఇ రామకృష్ణ తెలిపారు.ఆయా సబ్ స్టేషన్ పరిధిలోని నర్సింగబిల్లి, ఎన్‌జి పాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, కొత్తపల్లి, ఏఎస్ పేట, సోమవరం, కన్నూరు పాలెం, తీడ, చరకం, సుందరయ్యపేట, జీ భీమవరం, అచ్చెర్ల, మోసయ్య పేట, ఏనుగుతుని గ్రామాలకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు.

రిజిస్ట్రేషన్ల కార్యాలయాల్లో అదనపు సౌకర్యాలు

ప్రజాశక్తి- కె.కోటపాడు: జిల్లాలో ఉన్న పది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ జిల్లా రిజిస్ట్రార్ సిహెచ్ జానకి దేవి తెలిపారు. గురువారం కే కోటపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయానికి ఫర్నిచర్, రికార్డులు భద్రపరిచే బీరువాలు, కార్యాలయం బయట సీసీ కెమెరాలు ఏర్పాటు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో గత సంవత్సరం కన్నా 660 డాక్యుమెంట్లు తగ్గాయన్నారు. 2023లో 20వేలు డాక్యుమెంట్లు చేశామన్నారు. నాలుగు నెలల నుండి ఎన్నికలు మంచి ముహూర్తాలు లేకపోవడం తదితర కారణాలవల్ల రిజిస్ట్రేషన్లు తగ్గాయన్నారు.

జిల్లాలో కే కోటపాడు నక్కపల్లి మాడుగుల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, వీటికి త్వరలో స్థలం సమకూర్చవలసిందిగా జిల్లా కలెక్టర్‌ను కోరామన్నారు. మిగిలిన భవనాలు కూడా శిథిలావస్థలో ఉండటంతో పక్కా భవనాలకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. జిల్లాలో లంకెలపాలెం ఎలమంచిలి తప్ప మిగిలిన కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు పూర్తిగా తగ్గుముఖం పట్టాయన్నారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ బంగారి వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రంలోని దళితుల శ్మశాన వాటికను స్థానికులు ఆక్రమించి సాగు చేస్తున్నారని స్థానిక అంబేద్కర్ యూత్ సంఘం, ఎస్‌సి కాలనీ పెద్దలు ఆరోపించారు. గురువారం తహసిల్దార్ జి. లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేశారు. దేవరాపల్లి రెవెన్యూ పరిధిలోని 274/1 లో 4.64 ఎకరాల్ల విస్తీర్ణంలో దళితుల శ్మశానవాటిక ఉందన్నారు. ఆ భూమిని కొంతమంది ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేయడంతో విషయాన్ని గుర్తించిన అంబేద్కర్ యూత్ సంఘ సభ్యులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసిల్దార్ తక్షణమే స్పందిస్తూ వెంటనే స్మశాన వాటికను సర్వే చేయించి దళితులకు అప్పగించాలని రెవిన్యూ సిబ్బందిని ఆదేశించారు. సర్వేయర్ నాయుడు, విఆర్ఓ బి. నాగేశ్వరరావు సర్వే జరిపి అందులో 61 సెంట్లు భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించి, సరిహద్దులు వేసి దళితులకు అప్పగించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట బాలికల హైస్కూల్‌లో విద్యార్థులు గురువారంవివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు హెచ్ఎం ఎం.స్వర్ణ కుమారి, పిడి పెంటకోట సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి -వడ్డాది : కౌలు రైతులందరూ గుర్తింపు కార్డు కలిగి ఉండాలని పూడి సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ బ్లిసి అన్నారు. కౌలు రైతులు .భూయజమాని పాసుపుస్తకం, ఆధార్ కార్డ్ జిరాక్సుతోపాటు కౌలుదారు ఆధార్ కార్డ్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, రూ. 10 రెవెన్యూ బాండ్ పేపర్ మీద 11 నెలలకు ఒప్పందం రాసుకొని పంచాయతీ విఆర్ఒ వద్దకు తీసుకు వస్తే, కౌలురైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తారన్నారు గ్రామ సచివాలయంలోగ్రామ వ్యవసాయ సహాయకులకు ఒక కాఫీ అందించాలన్నారు.

సెజ్, ఫార్మా ప్రమాదాలపై సమగ్ర విచారణ

ప్రజాశక్తి-అనకాపల్లి :జిల్లాలో ఫార్మాసిటీ, అచ్యుతాపురం సెజ్‌లో తరచూ జరుగుతున్న ప్రమాదాలపై సమగ్రమైన విచారణ చేపట్టి బాధ్యులైన యాజమాన్యాలపై కఠినచర్యలు తీసుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. గురువారం యూనియన్ జిల్లా కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ పరిశ్రమల్లో కనీస భద్రత లేకపోవడం వల్ల కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలపై నియమించిన విచారణ కమిటీ రిపోర్టును బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

డైట్ కళాశాలలో ఇన్నోవేషన్, స్టార్టప్ సెషన్

ప్రజాశక్తి - అనకాపల్లి : స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) అటానమస్ కళాశాల ఇన్స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసి), డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ ఇంజినీరింగ్ సంయుక్తంగా గురువారం 'ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్' సెషన్ నిర్వహించారు. ముఖ్య వక్తగా వై బాబ్జి మాట్లాడుతూ స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడంలో, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో క్రియాశీలక సంస్థల కీలకపాత్రను ప్రస్తావించారు. స్టార్టప్ వ్యవస్థ ప్రస్తుత స్థితి,ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటి వృద్ధికి అవసరమైన సహాయక విధానాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. అనుభవజ్ఞులైన వ్యాపార విశ్లేషకులను, పారిశ్రామికవేత్తలతో స్టార్ణప్‌లను సంయుక్తం చేయడం వలన వారి వృద్ధి, విజయాన్ని గణనీయంగా వేగవంతం చేయవచ్చని సూచించారు. స్టార్ట్-అప్ ఎకోసిస్టమ్‌లో ఆర్థిక సంస్థలు, పెట్టుబడిదారుల పాత్ర గురించి చర్చించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ ఆర్ వైకుంఠ రావు, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి వి భార్గవి, ఆర్ అండ్ డి కోఆర్డినేటర్ వివి ప్రసన్నకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై అఖిలపక్ష నేతల వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని గ్రామీణ ప్రాంతాలలో ప్రజా సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అఖిలపక్ష నేతలు కోరారు. బిఎస్‌పి అనకాపల్లి ఇంచార్జ్ సూదికొండ మాణిక్యాలరావు ఆధ్వర్యంలో అఖిలపక్ష నేతలు అనకాపల్లి మండలపరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు, కాంగ్రెస్ నేత కట్టుమూరి నూక అప్పారావు, మహా జన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లి చినఅప్పారావు, దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా కార్యదర్శి కొల్లి సత్యారావు ఆంధ్రప్రదేశ్ దళిత వేదిక జిల్లా అధ్యక్షులు పెట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో పారిశుధ్య పరిస్థితి అధ్వానంగాఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో పూర్తిస్థాయిలో సిసి రోడ్లు, మురికి నీటి కాలువల నిర్మాణం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో ప్రధాన రహదారులు, జంక్షన్‌లో సులాబ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కోరారు. సత్యనారాయణపురం గ్రామ పంచాయతీ మూలపేట గ్రామం లో అసంపూర్ణంగా నిలిచిపోయిన ఆసుపత్రి భవనం, డ్రైనేజీలు పూర్తిచేయాలని, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరారు. పందుల, కుక్కల సంచారాన్ని అరికట్టాలని కోరారు.

దోమల నివారణపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి -మునగపాక: మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో దోమల నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలపై గురువారం వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీటి నిలవలు లేకుండా జాగ్రత్త తీసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో వార్డ్ సభ్యుడు సూరిశెట్టి రమణ, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి అభిరామ్ ఎంపిక

ప్రజాశక్తి- కశింకోట : మండలంలో తాళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వై. అభిరామ్ నూజివీడు ట్రిపుల్ ఐటికి ఎంపికైన సంధర్భంగా ఎంఇఒలు కె. చిట్టిబాబు, సూర్య నారాయణ మూర్తి అభినందిచారు అభిరామ్‌ను సత్కరించి భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు,గామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమం లో సి ఆర్ పి సత్తి బాబు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో నిధులు కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్రబడ్జెట్‌లో రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు రూ.12 వేల కోట్లు ప్రకటించడంపై ప్రధాని మోడీ, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, బిజెపి సీనియర్ నాయకులు పీలా మురళి, జనసేన నాయకులు పల్లేల గణేష్ ధన్యవాదాలు తెలుపుతూ, హర్షం వ్యక్తం చేశారు. గురువారం తుమ్మపాలలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, సిఎంచంద్రబాబు ముందుచూపు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చొరవతో ఇది సాధ్యమైందని, భవిష్యత్‌లో మరిన్ని నిధులతో ఎపి అన్ని విధాలా పురోభివృద్ధి సాధిస్తుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కొణతాల సావిత్రి, టిడిపి నాయకులు కరణం శ్రీనివాసరావు,టిఎన్టియుసి మీడియా కో-ఆర్డినేటర్ నాయకులు గొర్లి శ్రీనివాసరావు, కార్మిక నాయకులు, స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ ఆకుల శ్రీనివాసరావు, న్యాయవాది కొత్తపల్లి జయరాజు,కొత్తపల్లి చిరంజీవి పాల్గొన్నారు.

సబ్బవరం. : కేంద్రబడ్జెట్‌లో రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు రుణం మంజూరుకు ప్రతిపాదన హర్షదాయకమని అనకాపల్లి జిల్లా తెలుగు యువత పిబివిఎస్ఎన్ అన్నారు. కేంద్రం నుండి నిధులు రాబట్టేందుకు కషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి అభినందనీయమన్నారు. గత ప్రభుత్వాలు ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టి రుణాలు సమకూర్చుకునేవని, ఇప్పుడు కేంద్రప్రభుత్వమే సహకారం అందించేందుకు ముందుకు రావడం ఆనందదాయకమన్నారు. అమరావతికి నిధులు పోలవరం ప్రాజెక్టును పూర్తికి కేంద్రం సుముఖత , విశాఖ-చెన్నై ప్రత్యేక కారిడార్, రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయింపు శుభపరిణామం అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమాలోచనలు జరిపి విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, విశాఖ రైల్వేజోన్‌పై స్పష్టమైన ప్రకటన చేయించాలని కోరారు.

ఇసుక, మెటల్ కొరతపై ధర్నా



మాట్లాడుతున్న సిఐటియు నేత రాజు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఇసుక, కాంక్రీట్ మెటల్ కొరతను పరిష్కరించాలని అనకాపల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, గత నలబై రోజులుగా ఇసుక, కాంక్రీట్ మెటల్ కొరతతో నర్సీపట్నంలో నిర్మాణ పనులు మందగించాయన్నారు. దీంతో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నర్సీపట్నం ఇసుక యార్డులో ఇసుక అక్రమాలు జరిగాయని, విచారణ జరిపి నిర్ధారించాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అధికార్లను ఆదేశించినా నేటికి ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో, యార్డులో ఇసుక ఉన్నా నర్సీపట్నం ప్రాంతంలో నిర్మాణదారులు తీవ్రమైన కొరతను ఎదుర్కొంటున్నారన్నారు. కాంక్రీట్ మెటల్ సరఫరా కూడా ఆగిపోయిందని తెలిపారు. దీంతో నిర్మాణాలు నిలిచి పనులు లేక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీవో తక్షణమే స్పందించి ఇసుక, కాంక్రీట్ మెటల్ కొరతను పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా అధ్యక్షులు కె.రామకృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సత్తిబాబు, డి.శివ, గోవింద్, వెంకటేష్, బద్రం, సత్తిబాబు,తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాబార్డ్ ఏజిఎం

పొదుపుతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి -చీడికాడ: మహిళలు పొదుపుతోనే ఇంటిని అభివృద్ధి పరుస్తారని నాబార్డ్ ఏజిఎం జిఆర్ సంపత్ కుమార్ తెలిపారు. స్థానిక తులసి కళ్యాణ మండపంలో స్వాతి పరస్పర సహకార పొదుపు సంఘం 29వ మహాజనసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాబార్డ్ ఏజిఎం మాట్లాడుతూ కుటుంబంలో మహిళలు డబ్బును పొదుపుగా వాడితే ఆ ఆర్థిక పటిష్టత ఉంటుందన్నారు. ఈ సంఘంలో సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి లాభాల బాటలో తీసుకెళ్లడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు.నాబార్డ్ నుండి ఎటువంటి సహాయ సహకారం కావాలన్నా అందించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్ ఎస్.సతీష్ చంద్ర, జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ కలెక్టర్ మోహన్‌రావు, జిల్లా డిసిసి జనరల్ మేనేజర్ శ్రీధర్, ఆచార్య నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ముర్రు ముత్యాల నాయుడు, జిల్లా డిసిఓ ప్రేమ స్వరూపరాణి, మేనేజర్ దేముడమ్మ పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారికి కొమ్ముకాస్తున్న రెవెన్యూ అధికారులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ, విశాఖ సిరిపురంలో 500 కోట్ల విలువ చేసే సాంఘిక సంక్షేమ శాఖ భూమిని కబ్జా చేసిన మత బోధకుడుపై చట్టపరమైన చర్యలు తీసుకుని కబ్జాకు గురైన భూమికి రక్షణ కల్పించాలన్నారు. విలువైన భూములపై కన్నేసిన కబ్జాదారులకు రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతూ కబ్జా దారులకు కొమ్ము కాస్తున్న రెవెన్యూ అధికారులపై కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని హెద్దేవా చేశారు. కబ్జాలపై ఎన్ని ఫిర్యాదులు చేసినా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోలేదన్నారు.



సాగు పుస్తకాలు ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

పామ్ ఆయిల్ సాగుపై అవగాహన

ప్రజాశక్తి - నాతవరం: మండలంలోని చమ్మచింత గ్రామంలో ఫామ్ ఆయిల్ సాగు, అంతర పంటలపై గురువారం అవగాహన కల్పించారు. పామ్ ఆయిల్ పంటలో అంతర పంటగా సాగు ఎలా నాటాలి, దాని ఉపయోగాలపై రైతులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అడం అగ్రూర్డ్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్, సీఈవో అగ్రూర్డ్ ప్రసాద్ సంపంగి, ఎండి పాలూరు రాంబాబు, ఏరియా ఈడి రాజలక్ష్మి, సభ్యులు కే. కోటేశ్వరరావు, టిడిపి నేత సత్య నారాయణ పాల్గొన్నారు.

ఒలింపిక్స్‌లో విజయం సాధించాలి



నక్కపల్లిలో ర్యాలీ చేపడుతున్న టీచర్స్, విద్యార్థులు

ప్రజాశక్తి -నక్కపల్లి:పారిస్ ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు విజయం సాధించాలని నక్కపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం రాణి లలిత ఆకాంక్షించారు. పారిస్ ఒలింపిక్స్ శుక్రవారం నుండి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు భారత క్రీడాకారులకు సంఘీభావం తెలుపుతూ గురువారం విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. భారత క్రీడాకారులు అన్ని క్రీడా పోటీల్లోనూ విజయం సాధించి పతకాలతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ కార్యదర్శి కొల్నాటి తాతాజీ , హాకీ కోచ్ రాంబాబు, రజిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: ఒలింపిక్స్ లో భారత తరపున పాల్గొంటున్న క్రీడాకారులు ప్రతిభ చూపి పతకాలు సాధించాలని కోరుతూ గురువారం నర్సీపట్నం శాఖాగ్రంథాలయంలో బెస్ట్ ఆఫ్ లక్ ఇండియా కార్యక్రమం గ్రంథాలయధికారిని దమయంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. నర్సీపట్నం టౌన్ ఎస్సై సుధాకర్, ఆర్‌సిఎం చర్చి రెవ ఫాదర్ కె.శౌరిబాబు, ఎంఇఒలు నాగేంద్ర, వరహాలబాబు, రాష్ట్ర ఉత్తమ వ్యాయామ అవార్డు గ్రహీత పి.ప్రభాకర్, విశ్రాంత గ్రంథపాలకులు జి.మురళీకృష్ణ, కె.త్రిమూర్తులు హాజరై సంతకాలు చేశారు. ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ మన క్రీడాకారులు విజయంతో తిరిగిరావాలని కోరారు.

పారిశుధ్య పనులపై దృష్టి

ప్రజాశక్తి-గొలుగొండ:పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని ఎంపిడివో రత్నకుమారి సూచించారు. గురువారం మండలంలోని పలు పంచాయతీల్లో పర్యటించారు. ముందుగా ఆమె కృష్ణదేవిపేట గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ఏఎల్ పురం చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. వర్షాలకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. శ్మశాన వాటిక మార్గంలో పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి రమణి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, కిరణ్మయిలు పాల్గొన్నారు.

కోటవురట్ల:గ్రామీణ ప్రాంతాలలో పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఎస్ఎస్ఎస్ మూర్తి సూచించారు. గురువారం ఆయన మండలంలో పలు గ్రామాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య పనులను పరిశీలించారు. స్థానిక ఎంపీటీసీ సూర్యారావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జానకి శ్రీను గ్రామంలో సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి స్వామి నాయుడు, కోటవురట్ల కార్యదర్శి శ్రీనివాసు పాల్గొన్నారు.

జిఒ 217 రద్దుపై మత్స్యకారుల హర్షం

ప్రజాశక్తి-నక్కపల్లి:జీఓ 217 రద్దు పై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పై మత్స్యకార నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వంతీసుకొచ్చిన జీఓ నెంబర్ 217 రద్దు చేస్తూ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని, క్యాబినెట్ లో ఆమోదించి రద్దు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు శాసనసభలో వెల్లడించడం పట్ల మత్స్యకార నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. మత్స్యకార జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు కంబాల అమ్మోరయ్య గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం జీఓ 217 ను తీసుకొచ్చి మత్స్యకారుల ఉపాధిని, ఉనికిని దెబ్బతీసిందన్నారు. మత్స్యకార జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పిక్కి. కోదండరాం, నాయకులు సూకరాజు, అప్పలరాజు, రాజు, సూకరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్



నక్కపల్లిలో చేపడుతున్న ప్రదర్శన

సర్వే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల తహసిల్దార్ కార్యాలయాన్ని గురువారం భూ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ గోపాలరాజు సందర్శించారు. తహసిల్దార్ వెంకటరమణతో పలు అంశాలపై చర్చించారు. అనంతరం సర్వే సిబ్బందితో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ, ప్రధానంగా ఎఫ్ లైను, ఆన్లైన్ ప్రక్రియ, సబ్ డివిజన్‌లపై అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అవకతవకలు పాల్పడరాదని సూచించారు. సంబంధిత రికార్డులను రికార్డులను భద్ర పరుచుకోవాలన్నారు. అనంతరం మండలంలో పలు గ్రామాలను సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాస్, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని ఎంఈఓ కె.నరేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా జాతీయ విద్యా విధానం 4వ వార్షికోత్సవం పురస్కరించుకొని పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల కోలాట ప్రదర్శన, వివిధ నృత్యాలు ఎంతగానో అలరించాయి.

కోటవురట్ల:కోటవురట్ల ప్రభుత్వ పాఠశాల, పందూరు, వెంకటాపురం, సహా పలు గ్రామాలలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



ఎస్ఐకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సీపట్నం బస్ కాంప్లెక్స్‌లో

అల్లరి మూకలను అరికట్టాలి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విద్యార్థుల ముసుగులో అల్లరి మూకలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వీరిని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.గీతాకృష్ణ కోరారు. ఈ మేరకు గురువారం నర్సీపట్నం టౌన్ ఎస్సైలు ఉమామహేశ్వరరావు, సుధాకర్‌లకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులను పలు ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుందన్నారు. సాయంత్రం 4.30 నుంచి 6 గంటల సమయంలో విద్యార్థులను అల్లరి మూకలు ఇబ్బందులకు గురి చేయడంతో పాటు గొడవలకు దిగుతున్నారన్నారు. బైకులపై వేగంగా వెళుతూ భయాందోళనలకు గురి చేస్తున్నారని చెప్పారు. కొంత మంది విద్యార్థులపై దాడులకు దిగుతున్న పరిస్థితి ఉందన్నారు. బైక్‌లపై తిరుగుతున్న విద్యార్థులను దూషించడం, ఎదిరిస్తే వారిపై దాడులకు తెగబడుతున్నారని తెలిపారు. అల్లరి మూకలపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ రాజు, డివిజన్ సభ్యులు జ్ఞానేశ్, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:33/11 కేవీ బలిఘట్టం సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 26న శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డివిజనల్ ఇంజనీర్ విడివి.రామకృష్ణారావు గురువారం తెలిపారు. లైన్, సబ్ స్టేషన్ మరమ్మత్తులు, చెట్ల కొమ్మలు తొలగించుట వంటివి చేపట్టనుండటంతో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బలిఘట్టం, బయపురెడ్డిపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కొత్తకోట:కొత్తకోట సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రావికమతం మండల విద్యుత్ శాఖ ఏఈ నందన్ చెప్పారు. గురువారం సాయంత్రం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, కొత్తకోట సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతున్న దృష్ట్యా జంగిల్ క్లియరెన్స్‌తో పాటు వార్షిక ట్రాన్స్ఫార్మర్ల మరమ్మతులు చేపడుతున్నట్లు ఏఈ వివరించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న గ్రామస్తులు

పొంగలిపాక గ్రామస్తుల శ్రమదానం

ప్రజాశక్తి-మాడుగుల: పొంగలిపాక గ్రామస్తుల శ్రమదానం అందరికీ ఆదర్శంగా నిలిచింది. గురువారం గ్రామంలో ఇంటికి ఒకరి చొప్పున కలిసి సెక్రటరీ పద్మ, సర్పంచు నాయన సత్యనారాయణ, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, ఉప సర్పంచ్ ఉండూరు భాస్కరరావు, జనసేన సభ్యులు కుమారు, నాగు ఆధ్వర్యంలో రోడ్డుకి ఇరువైపులా ఉన్న తుప్పలు తొలగించారు. మురుగు కాలువలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌పై నిరసనలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్:పాయకరావుపేట శ్రీ ప్రకాష్ లో గురువారం స్కూలు కెప్టెన్, హౌస్ కెప్టెన్ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిధిగా 13 ఆంధ్రా ఎన్.సి.సి. బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని పేర్కొన్నారు. చదువుకునే వయస్సులో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని చెప్పారు. కష్టపడితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. మంచి పౌరులుగా మారేందుకు నాయకత్వ లక్షణాలపై పట్టు సాధించాలని తెలిపారు.

విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ, విద్యార్థులు ఎవరి భవిష్యత్తుకు వారే మార్గదర్శకులన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ ద్వారా ముఖ్య అతిథి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఫిజియోథెరపీ చేస్తున్న లావణ్య

ఫిజియోథెరఫీతో సత్ఫలితాలు

ప్రజాశక్తి- కొత్తకోట: విభిన్న ప్రతిభవంత విద్యార్థులకు ఫిజియోథెరపీ చేయడంతో మంచి సత్ఫలితాలను సాధించవచ్చని ఎంఈవో సి.హెచ్ తలుపులు తెలిపారు. రావికమతం భవితా కేంద్రంలో నూతనంగా నియమితులైన ఫిజియోథెరపిస్ట్ లావణ్య ఫిజియోథెరపీ సేవలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి మాట్లాడుతూ, ఇకనుండి ప్రతి సోమవారం రావికమతం భవిత కేంద్రంలో ఈ క్యాంపులను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఫిజియోథెరపీ అవసరమైన దివ్యాంగ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాథ నాయుడు, సరోజిని, మేడివాడ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పలు చోట్ల ఆధార్ శిబిరాలు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలోని పలు సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ శిబిరాలను సద్వినియోగించుకోవాలని ఎంపీడీవో కాశీ విశ్వనాథ్ తెలిపారు. గురువారం బికె పల్లి సచివాలయంలో నిర్వహిస్తున్న కేంద్రాన్ని పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు.

చీడికాడ:ఆధార్ సేవలను సద్వినియోగపరుచుకోవాలని జి.కొత్తపల్లి సర్పంచ్ కొల్లి సూరి నాయుడు సూచించారు. మండలంలోని జి.కొత్తపల్లి సచివాలయంలో ఉచిత ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి గోపి, వీఆర్వో రెడ్డి ప్రసాద్, పాల్గొన్నారు.



చీడికాడలో ప్రారంభిస్తున్న సర్పంచ్

- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సిపిఎం ఆధ్వర్యాన ర్యాలీలు, ధర్నాలు
- ఉత్తరాంధ్రకు ద్రోహంపై మండిపాటు



పరవాడలో...

ప్రజాశక్తి - అనకాపల్లి : కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి, వెనుకబడిన ఉత్తరాంధ్రకు తీవ్ర ద్రోహం చేసిందని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తీవ్రంగా విమర్శించారు. ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా గురువారం సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అనకాపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ బడ్జెట్లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఊసే లేదని, రైల్వే జోన్, కడప ఉక్కు, మెట్రో, విద్య, వైద్యసంస్థలు, ఉత్తరాంధ్ర, రాయలసీమల్లో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ తదితర చట్టబద్ధమైన హామీలు బడ్జెట్‌లో చోటులేదన్నారు.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం, అవసరమైన నిధుల కేటాయింపు ప్రస్తావన లేదన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు అప్పులు ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారుఉ. బిజెపితో దోస్తీ కట్టిన టిడిపి, జనసేన పార్టీలు బడ్జెట్ కేటాయింపులకు కేంద్రంపై ఒత్తిడి తేవడంలో విఫలమయ్యారన్నారు. ఎరువుల సబ్సిడీకి కేటాయింపులు తగ్గించడంతోపాటు పిఎం గరీబ్ కళ్యాణ్ యోజన అమలు చేస్తామంటూనే ఆహార సబ్సిడీకి భారీగా కోత పెట్టారని ఆవేదన వ్యక్తం చేస్తారు.ఉపాధి హామీ పథకం, పంటల బీమా, పిఎం కిసాన్, ఇలా అన్ని పథకాలకు నిధుల కేటాయింపులు తగ్గించారన్నారు. పంటలకు కనీస మద్దతు ధర చట్టబద్ధతకు రైతులు ఆందోళనలు చేస్తుండగా, బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం రైతాంగాన్ని దగా చేయడమేనన్నారు గత బడ్జెట్‌తో పోలిస్తే ఆహారం, ఎరువులు, ఇంధన రంగాల్లోని సబ్సిడీలకు కేటాయింపులు 7.8 శాతం కోతపెట్టి ప్రజలను దగా చేశారని మండిపడ్డారు. నిరసనలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, వి.వి.శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యన్నారాయణ, అల్లు రాజు, సిపిఎం నాయకులు గండి నాయనబాబు, నాగిరెడ్డి సత్యనారాయణ, డి.శ్రీనివాసరావు, బి.నూకఅప్పారావు, పి.చలపతి పాల్గొన్నారు.

పరవాడ: ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా సిఐటియు ఆధ్వర్యంలో పరవాడ సినిమా హాల్ జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు కే నాయుడు, శ్రీను, జి అప్పారావు, రమణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక బడ్జెట్‌కు వ్యతిరేకంగా అచ్యుతాపురంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఎం మండల కన్వీనర్ ఆర్ రాము ఆధ్వర్యంలో బడ్జెట్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాంబిల్లి నక్కపల్లి క్లస్టర్లలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించలేదని నిరసించారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ జోక్యం చేసకుని స్థానిక సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు వచ్చేలా ప్రయత్నించాలని కోరారు కార్యక్రమంలో సిపిఎం రాంబిల్లి మండల కార్యదర్శి జి దేవుడు నాయుడు, నాయకులు చింతకాయల శివాజీ ,కొండ్రపు సోమనాయుడు, నూకన్న, రాజు పాల్గొన్నారు.

నక్కపల్లి:కేంద్ర బడ్జెట్ లో ఏపీకి ఒరిగిందేమీ లేదని, తీవ్ర అన్యాయం జరిగిందని సిపిఎం మండల కార్యదర్శి మనబాల రాజేష్ అన్నారు. మండలంలోని ఎన్.నరసాపురంలో గురువారం బడ్జెట్‌పై సిపిఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ,రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, పోలవరం వంటి భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులు కేటాయింపు, విశాఖ రైల్వే జోన్, స్టీల్ ప్లాంట్ పరిరక్షణ వంటి అనేక అంశాలను పక్కన పెట్టిందన్నారు. నక్కపల్లి క్లస్టర్లలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించలేదన్నారు. ఎంపీ సీఎం రమేష్ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు రాబట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గొర్ల రమణ, మనబాల రమణ, మనబాల శ్రీను, సారిపల్లి శివ, పల్లా స్వామి, పల్లా శివ పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్‌లో ఆంధ్రరాష్ట్రానికే కాకుండా ఉత్తరాంధ్రకు తీవ్ర ద్రోహం చేసిందని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు దుయ్యబట్టారు. ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌పై సిపిఎం మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం మార్కెట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి 11 ఏళ్ల నుండి ద్రోహం చేస్తున్నా రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు నోరుమెదపకపోవడాన్ని తప్పుబట్టారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో కలుపుతామని ప్రకటన చేయకపోగా స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన వర్కింగ్ క్యాపిటల్‌కు సైతం రూ.5 వేల కోట్లు నిధులు కేటాయించలేదన్నారు. తక్షణమే ఈ బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి నిధులు కేటాయించే విధంగా తగిన సవరణలు చేయాలని, అందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వంపై రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన, బిజెపి, వైసిపి ఎంపీలు ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి.మణి, జోన్ కమిటీ సభ్యులు పి.వెంకటరావు, కె.కుమారి, నాయకులు కెఎం.కుమార్ మంగళం, అనపర్తి అప్పారావు, జెఆర్.నాయుడు, వెంకటరావు, వైకుంఠరావు, తులసీరాం, విజయ, నాగేశ్వరరావు, త్రినాధం పాల్గొన్నారు.



కంచరపాలెంలో...

విశాఖ కలెక్టరేట్ : విశాఖ ముఠా కార్మిక సంఘం నాయకులు ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం కొత్త రోడ్, పూర్ణా మార్కెట్‌లో నిరసన చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘం గౌరవ అధ్యక్షులు వై.రాజు, డివైఎఫ్ఐ నాయకులు కె.సంతోష్ కుమార్, సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, పెద్ద సంఖ్యలో ముఠా కలాసీలు పాల్గొన్నారు.

సిపిఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన బిఎన్‌ఆర్ భవన్ నుంచి దేవేంద్రనగర్, రెడ్డి కంచరపాలెం, రైతు బజారు వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ, ఈ బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు వరాలు, సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానికి భారాలు మోపే విధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఒ.అప్పారావు, ఎం.ఈశ్వరరావు, బి.సింహాచలం, బమ్మిడి అప్పారావు, శంకరావు, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.



మల్కాపురంలో నిరసన చేపడుతున్న నాయకులు

పెందుర్తి : పెందుర్తి రైతు బజార్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి మాట్లాడుతూ, కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజానాట్యమండలి అధ్యక్షులు షేక్ మౌలాలి, సిఐటియు నాయకుడు అప్పలనాయుడు, పలు కాలనీల వాసులు పాల్గొన్నారు

సీతమ్మధార : సిపిఎం అక్కయ్యపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జోన్ కార్యదర్శి రాజు మాట్లాడుతూ, ప్రజలపై వేసిన పన్నుల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.అప్పలరాజు, పి.గౌరీష్, కన్నయ్య, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : పెదగంట్యాడ గాంధీ జంక్షన్‌లో సిపిఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొవిరి అప్పలరాజు, జి.శ్రీనివాస్, నమ్మి రమణ, బి.గురప్ప, కణితి అప్పలరాజు, పేర్ల మసేను, కంబాల మహేష్, సిహెచ్.రాముడు, బి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం గాజువాక జోన్ కమిటీ ఆధ్వర్యాన గాజువాకలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు ఎ.లోకేష్, పి.లక్ష్మి, స్వామి, గొలగాని అప్పారావు, నానాజీ, కె.చంద్రరావు పాల్గొన్నారు.

తగరపువలస : స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి జ్యూట్ కార్మిక వాడ మీదుగా జంక్షన్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్ఎస్ఎన్.మూర్తి, రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, నీలాతి రాము, పెంట రాజు, నరసింహారావు, ఈశ్వరరావు, పంపాన సూర్యనారాయణ, జీరు సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం : సిపిఎం గోపాలపట్నం జోన్ కమిటీ ఆధ్వర్యాన గోపాలపట్నం ప్రధాన రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జోన్ కార్యదర్శి బలివాడ వెంకటరావు, నాయకులు పి.అనసూయ, ఆర్.శ్రీనివాసరావు, ఆర్.సూర్యకాంతం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన శ్రీహరిపురం బస్‌స్టాప్ వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, నాయకులు కె.పెంటారావు, కె.నూకరాజు, ఆర్.దేవరాజు, బి.తాతాజీ, జానీ, హుస్సేను, పి.సురేష్, ఎం.కృష్ణారావు, కె.రమణ, బి.రాంబాబు, రాము, అప్పారావు పాల్గొన్నారు.



తగరపువలసలో..



నక్కపల్లిలో...